తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 70 | పేజీలు : 8 | ఎడిటర్ పి. రాజేష్ | శనివారం 10 ఆగస్టు 2024 | వెల : 4/-

# ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం దోచుకుంది



- రీ డిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుకు రూ. 18వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.8 వేల కోట్ల ప్రజల సొమ్మును కాజేసింది
- కాళేశ్వరం, ఇరిగేషన్‌లో ప్రజల సొమ్ము లూటీ చేశారని ఆరోపణలు
- రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు అన్ని సాగులోకి తెచ్చి రైతులకు ఉపయోగపడాలని శరవేగంగా పనులు చేస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం నాడు ఏన్కూర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ కాలువల నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రీ డిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుకు రూ. 18వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.8 వేల కోట్ల ప్రజల సొమ్మును కాజేసిందని విమర్శించారు. కాళేశ్వరం, ఇరిగేషన్‌లో ప్రజల సొమ్ము లూటీ చేశారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు అన్ని సాగులోకి తెచ్చి రైతులకు ఉపయోగపడాలని శరవేగంగా పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీతారామతో లక్షా 35 వేల ఎకరాలు వైరా, లంకా సాగర్ ప్రాజెక్ట్‌లు మైనర్ ఇరిగేషన్‌లో అనుసంధానం చేస్తున్నామని అన్నారు. ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారని - మిగతా 3లో



## అలాంటి ప్రతిపాదనేదీ లేదు

- బెంగళూరుకు మెట్రో సిటీ హోదాపై కేంద్రం
- సాధారణంగా ఒక నగరానికి మెట్రోపాలిటన్ సిటీ హోదా ఉంటే హౌస్ రెంట్ అలవెన్స్‌పై అదనంగా 10 శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది
- ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా నగరాలకు మాత్రమే మెట్రో పాలిటన్ సిటీ హోదా ఉన్నది.

### ఆగస్టు 15న రైతులను
# రుణ విముక్తి చేస్తాం

- లక్షన్నర వరకు రుణం ఉన్న వాళ్ళందరికి నేరుగా 12289 కోట్లు 16.29 లక్షల కుటుంబాలకు నిధులు విడుదల చేశాం
- రెండు లక్షల వరకు ఆగస్టు 15లోపు చేస్తామని స్పష్టం
- ఇందిరమ్మ రాజ్యంలో నిబద్ధతతో పని చేస్తున్నాం
- రాష్ట్ర బడ్జెట్‌లో రుణ మాఫీ ఒక్కటే కాదు...
- రైతు భీమాకి సంబంధించి ఒక వెయ్యి , 500 కోట్లు రైతుల తరుపున ప్రభుత్వం కడుతుంది
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం**

కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2 లక్షల రైతుల రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చామని.. చేసి చూపిస్తున్నామని తెలిపారు. జూలై 15 న జీవో ఇచ్చామని.. 18 జూలైన ఒక లక్ష రూపాయల రుషమాఫీ 6,983 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండవ సారీ రూ.6190.02 కోట్లతో జూలై మాసంలో మళ్ళీ విడుదల చేశామన్నారు. - మిగతా 3లో



# బీజేపీ, బీఆర్ఎస్ విలీనం
# సాధ్యమేనా?




- భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు
- డీల్ ఫైనల్ అయిపోయిందని విస్తృత ప్రచారం
- అంతర్గతంగా గత నాలుగుదు నెలలుగా ఈ తరహా ప్రచారం
- అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు.
- ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు
- బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది

3



# విద్యాసంస్థల్లో హిజాబ్‌లు ధరించొచ్చు



**ఢిల్లీ:** కళాశాల క్యాంపస్‌లలో విద్యార్థులు హిజాబ్‌లు ధరించడాన్ని నిషేధిస్తూ ముంబయికి చెందిన ఓ ప్రైవేట్ కాలేజీ ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. హిజాబ్‌పై నిషేధం విధిస్తే మహిళా సాధికారత ఎలా సాధ్యపడుతుందని కళాశాల యాజమాన్యాన్ని కోర్టు ప్రశ్నించింది. హిజాబ్ ధరించేందుకు ముస్లిం విద్యార్థినులకు అనుమతించింది. ఈ కేసుపై గతంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా సుప్రీం స్టే విధించింది. కళాశాల యాజమాన్యం తీరుపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఏం ధరించాలేనేది మీరెలా నిర్ణయిస్తారు.. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థినులు ఏం ధరించాలో కాలేజీలు నిర్ణయిస్తే మహిళా సాధికారికత మాటేంటని ప్రశ్నించింది. కళాశాలలో అందరూ సమానమని, మతాల ప్రదర్శనకు అది వేదిక కాకూడదనే ఉద్దేశంతోనే తాము హిజాబ్‌ని నిషేధించామని.. చెంబూరు(ముంబయి) కళాశాల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. పేర్లల్లో కూడా మతం ఉంటుందని.. మరి దాన్ని ఎలా తొలగిస్తారని కళాశాల యాజమాన్యాన్ని తిరిగి ప్రశ్నించింది. "అమ్మాయిలు ఏం ధరించాలనేది వారి వ్యక్తిగత నిర్ణయం. దేశంలో అనేక మతాల ప్రజలు నివసిస్తున్న విషయం కళాశాల యాజమాన్యానికి తెలియదా? స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లకుపైనే అవుతున్నా.. ఇప్పటికీ ఇలాంటి అంశాలపై చర్చ రావడం దురదృష్టకరం. మేం ఇచ్చిన ఉత్తర్వులను దుర్వినియోగం చేయకూడదు" అని కోర్టు తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది. కాలేజ్‌లో హిజాబ్ నిషేధంపై పలువురు విద్యార్థినులు సుప్రీం తలుపుతట్టగా.. తాజాగా ధర్మాసనం తీర్పు వెలువరించింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను ఎవరూ దుర్వినియోగం చేయరాదని అలాంటిదేమైనా జరిగితే తమని ఆశ్రయించవచ్చని.. విద్యా సంఘాలకు సూచించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం 'ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠే కాలేజీ'ని నిర్వహిస్తున్న చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీకి నోటీసులు జారీ చేసింది. నవంబర్ 18లోగా ఈ అంశంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు



బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడులు జరుగుతుండటంతో నరేంద్రమోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మైనార్టీలపై దాడుల ఘటన మీద భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను... సరిహద్దులో నెలకొన్న పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్రం ఐదుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులు, ఇతర మైనార్టీల భద్రతను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. బీఎస్‌ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఈ కమిటీని నియమించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం వీడిన అనంతరం హింసాకాండ కొనసాగుతూనే ఉన్నది. ఈ క్రమంలో కేంద్రం చొరవ తీసుకున్నది. అక్కడి హిందువులు, మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో నివాసం ఉంటున్న భారతీయులు, హిందువులు, మైనారిటీల భద్రత, సౌకర్యాలకు సంబంధించి అక్కడి హోంమంత్రిత్వ శాఖ అధికారులతో ఈ కమిటీ చర్చలు జరుపనున్నది. భారత్ %-% బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రత, ప్రస్తుత పరిస్థితులను సైతం సమీక్షించనున్నది. బంగ్లాలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మోదీ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఈస్ట్ జోన్ ఏడీజీని కమిటీకి చైర్మన్‌గా నియమించారు. బీఎస్‌ఎఫ్ సౌత్ బెంగాల్ ఐజీ, ఐజీ బీఎస్‌ఎఫ్ త్రిపుర, ఇండియన్ ల్యాండ్ పోర్ట్స్ అథారిటీకి చెందిన ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సభ్యుడు, సెక్రటరీ సభ్యులుగా ఉంటారు.

వాస్తవానికి ఇస్లామిక్ ఛాందసవాదులు బంగ్లాదేశ్‌లోని హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడుతున్నారు. సోమవారం మొదలైన దాడుల్లో ఇప్పటి వరకు వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దాడుల భయంతోనే అనేక కుటుంబాలు మూకుమ్మడిగా వలస వెళ్లాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని హిందువులు భారత్‌లోకి వచ్చేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దులోని ఠాకూర్‌గావ్, పంచగఢ్ ప్రాంతాలకు వేలాది మంది హిందువులు చేరుకున్నారు. పలుచోట్ల ఇండ్లు, దుకాణాలతో పాటు దేవాలయాల్లోని విలువైన వస్తువులను సైతం దుండగులు దోచుకు వెళ్తున్నట్లు సమాచారం. అక్కడే ఉంటే చంపేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. అయితే, బంగ్లాదేశ్ బోర్డ్ గార్డ్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నా హిందూ కుటుంబాలు స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధంగా లేవని.. అయితే, భారత సరిహద్దుల్లోకి ప్రవేశించేందుకు వీసాలు లేవని అలోఖవ సంఘ అధ్యక్షుడు మోజక్రుల్ ఆలం కొచ్చి తెలిపారు. ప్రస్తుతం సరిహద్దుల్లో 5వేల మంది వరకు ఉన్నట్లుగా చెప్పారు.

అక్కడి భారతీయులు, హిందువులు, మైనార్టీల భద్రత, సౌకర్యాలకు సంబంధించి అక్కడి హోంమంత్రిత్వ శాఖ అధికారులతో ఈ కమిటీ చర్చలు జరుపుతుంది. ఈ కమిటీలో బీఎస్‌ఎఫ్ సౌత్ బెంగాల్ ఐజీ, ఐజీ బీఎస్‌ఎఫ్ త్రిపుర, ఇండియన్ ల్యాండ్ పోర్ట్స్ అథారిటీకి చెందిన ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సభ్యుడు, సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడి మైనార్టీ వర్గాల భద్రత కోసం ఈ కమిటీని ఏర్పాటు చేశామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇస్లామిక్ ఛాందసవాదులు బంగ్లాదేశ్‌లోని హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. సోమవారం మొదలైన దాడుల్లో ఇప్పటి వరకు వందలాది మంది మృతి చెందారు. దాడుల భయంతో హిందువులు సహా చాలా మైనార్టీ కుటుంబాలు మూకుమ్మడిగా వలస బాట పట్టాయి. వారు భారత్‌లోకి వచ్చేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దులోని ఠాకూర్‌గావ్, పంచగఢ్ ప్రాంతాలకు వేలాదిమంది హిందువులు చేరుకున్నారు. పలుచోట్ల ఇళ్లు, దుకాణాలతో పాటు దేవాలయాల్లోని విలువైన వస్తువులను సైతం దుండగులు దోచుకువెళ్లినట్లుగా తెలుస్తోంది. అక్కడే ఉంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు.

## నీట్ పీజీ ఎగ్జామ్‌ను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్ట్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** ఈ ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ ఎగ్జామ్‌ను వాయిదా వేయాలంటూ కొంతమంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్ కొట్టివేసింది. పరీక్షను వాయిదా వేయడానికి నిరాకరించింది. దాదాపు 2 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్‌ను ప్రమాదంలో పడేయలేమని వ్యాఖ్యానించింది. కాగా నీట్-యూజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా జూన్ 23న పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల ప్రవేశ పరీక్షను వాయిదా వేశారు. కాగా నగరాల్లో తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కష్టమని పేర్కొంటూ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎగ్జామ్ కేంద్రాలకు చేరుకోవడం చాలా మంది విద్యార్థులకు చాలా కష్టంగా ఉందని పేర్కొన్నారు. ఏ నగరంలో పరీక్ష కేంద్రం ఉంటుందనేది జులై 31న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) అధికారులు తెలిపారని పేర్కొన్నారు. ఇక ఆదివారం నిర్వహించాల్సిన పరీక్షా కేంద్రం సమాచారాన్ని గురువారం వెల్లడించారని విద్యార్థుల తరపు న్యాయవాది వాదించారు. రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారని, అయితే 'స్కోర్స్ నార్మలైజేషన్ ఫార్ములా'ను ఇంకా వెల్లడించలేదని పేర్కొన్నారు. వాదనలు విన్న సుప్రీంకోర్ట్ పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జడ్జిలు మనోజ్ మిశ్రా, జేబీ పార్దివాలాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పరీక్షకు కేవలం 2 రోజుల ముందు వాయిదా వేయాలని ఆదేశించలేమని తేల్చిచెప్పింది.

## అలాంటి ప్రతిపాదనేదీ లేదు



బెంగళూరుకు మెట్రో పాలిటన్ సిటీ హోదా ఇవ్వాలనే విషయంలో తమ ముందుకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్రం స్పష్టం చేసింది. బెంగళూరుకు మెట్రో సిటీ హోదా ఇవ్వాలనే ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఉందా.. లేదా..? అని లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. సాధారణంగా ఒక నగరానికి మెట్రోపాలిటన్ సిటీ హోదా ఉంటే హౌస్ రెంట్ అలవెన్స్‌పై అదనంగా 10 శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇప్పుడు మన దేశంలో ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా నగరాలకు మాత్రమే మెట్రో పాలిటన్ సిటీ హోదా ఉన్నది. ఆ నగరాల్లో పన్ను చెల్లింపుదారులకు హెచ్‌ఆర్‌ఏపై 10 శాతం అదనంగా పన్ను మినహాయింపు సదుపాయం ఉన్నది.

## కాంగ్రెస్ పునాదులను బీజేపీ, జేడీఎస్ పెకిలించలేవు




కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ, జేడీఎస్ కుట్ర పన్నుతున్నాయని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. మైసూర్‌లో శుక్రవారం జరిగిన జన్ ఆందోళన యాత్రను ఉద్దేశించి డీకే శివకుమార్ మాట్లాడారు. తాము సిద్ధరామయ్య వెన్నంటి ఉంటామని, కర్నాటకలో మరోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఐక్యంగా పనిచేస్తామని చెప్పారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో కేంద్ర మంత్రి, జేడీయూ నేత హెచ్‌డీ కుమారస్వామి ఏం అన్నారనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. జేడీఎస్ పార్టీ అగ్రనాయకత్వం వారి ఎమ్మెల్యేలను ఎదిగేందుకు అనుమతించదని అన్నారు. వారంతా జేడీఎస్ అగ్రనాయకత్వం కనుసన్నల్లో పనిచేయాల్సిందేనని చెప్పారు. కాంగ్రెస్ పునాదులను బీజేపీ, జేడీఎస్‌లు పెకిలించలేవని స్పష్టం చేశారు. అన్యాయం తలపెట్టిన వారు, పేదల వ్యతిరేకులపైనే తమ పోరాటమని డీకే శివకుమార్ పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ జన్ ఆందోళన యాత్రలో భాగంగా మైసూర్ వేదికగా కర్నాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం బీజేపీ, జేడీఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. రాజ్‌భవన్ కేంద్రంగా వారు (బీజేపీ-జేడీఎస్) తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నారని ఆరోపించారు. తనకు భూమి కేటాయించాలని తాను తన పలుకుబడిని ఉపయోగించానని బీజేపీ, జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నారని అన్నారు.

## కనువిందు చేస్తున్న 'బ్రహ్మ కమలం'



**చెన్నై:** తిరుపత్తూర్‌లో ఏడాదికి ఒకసారి పూసే బ్రహ్మ కమలం విరబూసింది. తిరుపత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని పూంగావనత్తమ్మన్ ఆలయ వీధికి చెందిన అన్బు తన ఇంట్లో తమలపాకులు సహా పలు రకాల పూల చెట్లు పెంచుతున్నాడు. వాటిలో బ్రహ్మ కమలం మొక్కలు కూడా ఉన్నాయి. ఈ పూవు ఏడాదికి ఒకసారి మాత్రమే ఆడి మాసంలో రాత్రి వేళ వికసిస్తుంది. ఆ ప్రకారం, అన్బు ఇంట్లో పెంచుతున్న బ్రహ్మ కమలం మొక్కకు సుమారు 10 పూలు గురువారం రాత్రి వికసించాయి. ఆడి మాసంలో వికసించే ఆ పూలను ఆశ్చర్యంగా చూస్తున్న ఆ ప్రాంత ప్రజలు, బ్రహ్మ కమలం పుష్పానికి పూజలు చేస్తున్నారు.


## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు.. ఉభయసభలు నిరవధిక వాయిదా



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి ఇక ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలు ఉభయ సభలను కుదిపేశాయి. పార్లమెంట్ సమావేశాలు గత నెల 22 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజు 2023-24 ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి లోక్ సభలో ప్రవేశపెట్టారు. 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది' అని ఈ ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. ఆ తర్వాత 23వ తేదీన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్డీయే కూటమి ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై ఉభయ సభల్లో వాడీవేడిగా చర్చ కొనసాగింది. చర్చ అనంతరం కేంద్ర బడ్జెట్‌కు సభ ఆమోదం తెలిపింది. ఇక ఈ సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకూ కొనసాగుతాయని ప్రభుత్వం ముందే ప్రకటించినప్పటికీ ఉభయ సభలు ముందుగానే నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## శభాష్ తల్లి.. వయనాడ్‌కి విరాళం కోసం

# 3 గంటలపాటు భరతనాట్యం



**తిరువనంతపురం:** కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి విపత్తు చూపిన విలయం అంతాఇంతా కాదు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో 417 మందికిపైగా చనిపోగా.. 150 మందికిపైగా మృతదేహాల ఆచూకీ ఇంకా లభించలేదు. సర్వస్వం కోల్పోయిన బాధితుల కోసం విరాళాలందించేందుకు ప్రముఖులు ముందుకొచ్చారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రభుత్వం తరపున రూ. 5 కోట్లు, తమిళ స్టార్ హీరోలు, టాలీవుడ్ నుంచి రెబల్ స్టార్ ప్రభాస్ రూ. 2కోట్లు, మెగాస్టార్ చిరంజీవి, రాంచరణ్ కలిపి రూ. కోటి, అల్లుఅర్జున్ రూ.25 లక్షలు అందించారు. వీరితోపాటు కంపెనీల అధినేతలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు ఇంకా ఎందరో వయనాడ్ బాధితులను ఆదుకోవడానికి ముందుకొచ్చారు. సామాన్యులు సైతం విరాళాలు అందించడానికి ముందుకొచ్చారు. అయితే తమిళనాడుకి చెందిన ఓ బాలిక(13) తన వంతు సాయంగా వయనాడ్ బాధితుల కోసం ఏదైనా చేయలనుకుంది. ఇందుకోసం అనూహ్య నిర్ణయం తీసుకుంది. తనకు వచ్చిన కళతో విరాళాలు సేకరించింది. ఆ నగదును కేరళ సీఎం పినరయి విజయన్‌కి అందించి ఎనలేని స్ఫూర్తిని నింపింది. హరిణి శ్రీ అనే బాలిక వయనాడ్ దుర్ఘటన జరిగినప్పటి నుంచి పేపర్లు, టీవీల్లో విషాదకర వార్తలు చూస్తూ తీవ్ర మనోవేదనకు గురయ్యేది. బాధిత కుటుంబాలకు తన వంతుగా ఏదైనా చేయాలని భావించేది. అలా ఓ సాహస నిర్ణయం తీసుకుంది. ఏకంగా 3 గంటలపాటు నిరంతరాయంగా భరతనాట్యం చేసి రూ.15 వేల విరాళాలను సేకరించింది. ఆ మొత్తాన్ని సీఎండీఆర్‌ఎఫ్‌కి అందించింది. విషయం తెలుసుకున్న సీఎం విజయన్ బాలికను తన కార్యాలయానికి పిలిపించుకొని ఆమె భరత నాట్య నృత్య ప్రదర్శనను చూశారు. చిన్నవయసే అయినా అంత పెద్ద మనసుతో అతి కష్టమైన పని చేసి విరాళాలు సేకరించడంపై ఆయన భావోద్వేగానికి గురయ్యారు. బాలికను అభినందించి.. కాసేపు ముచ్చటించారు. కాగా.. హరిణి రగిల్చిన స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలిచింది. నెటిజన్లు హరిణిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బాధితుల కన్నీరు తుడవడానికి చిట్టి చేతులతో ఇచ్చిన ఆ విరాళం ఎంతో గొప్పదని వారు అంటున్నారు.

**జాతీయ విపత్తుగా ప్రకటించాలి..**

కాగా వయనాడ్ దుర్ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరినట్లు సీఎం పినరయి విజయన్ శుక్రవారం తెలిపారు. విపత్తు తీవ్రతను పరిశీలించి నివేదిక సమర్పించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తొమ్మిది మంది సభ్యులతో కమిటీని నియమించిందని చెప్పారు. జులై 30న వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా నష్టపోయిన వారికి సాయం చేసేందుకు దేశ నలుమూలల నుంచి ముందుకువచ్చారు. కుండపోత వర్షాల కారణంగా వయనాడ్‌లోని ముండక్కై, చూరల్‌మల గ్రామాల్లో కొండచరియలు విరిగిపడి, ఇళ్లు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద 400లకుపైగా ప్రజలు చిక్కుకున్నారు. ఈ విపత్తులో ఇప్పటివరకు 417 మంది మరణించారు. ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నేతలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం (ఆగస్టు 10) వయనాడ్‌లో పర్యటించనున్నారు. అక్కడే ప్రధాని మోదీ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కాగా విపత్తును ఎదుర్కొనేందుకు తమకు అన్ని రకాలుగా సాయం చేస్తోందని విజయన్ తెలిపారు.

# బీజేపీ, బీఆర్ఎస్ విలీనం సాధ్యమేనా?

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని డీల్ ఫైనల్ అయిపోయిందని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగుదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు.గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. దాదాపుగా వారం రోజుల పాటు ఢిల్లీలో ఉన్నారు. ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వారు కూడా చెప్పలేదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంత సేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓ సారి ఫోటో రిలీజ్ చేశారు. అందు కోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన ప్రతిపాదనపై చర్చలు జరుపుతున్నారన్న బలమైన సమాచారం బయటకు రావడంతో కొంత మంది నేరుగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి విలీనం చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్ధంగా లేరు.కీలక నేతలు ప్రతి రోజూ తెలంగాణ భవన్ లో ప్రెస్మీట్లు పెడుతున్నారు కానీ.. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. కేటీఆర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు కానీ.. బీజేపీతో ఎలాంటి సంబంధాలు ఉండవని చెప్పడం లేదు. తెలంగాణ కోసం పోరాడతామని చెబుతున్నారు. అది బీఆర్ఎస్ పార్టీ ద్వారానేనా అన్నదానిపై బెనిఫిట్ ఆఫ్ డౌట్ అన్నట్లుగా స్పందిస్తున్నారు. బీఆర్ఎస్ మత్రమే కాదు..అసలు బీజేపీ కూడా స్పందించడం లేదు. బీజేపీ నేతలు స్పందించినా కాస్త క్లారిటీ ఉండేది. కానీ స్పందించడానికి వారు కూడా వెనుకడుగు వేస్తున్నారు. అంటే నిప్పు లేనిదే పొగ రాదన్న ట్లుగా ఢిల్లీలో ఏదో జరుగుతోందని సులువుగా అర్థమైపో తుంది. స్వయంగా మజ్లిస్ పార్టీ చీఫ్ అసుద్దన్ కూడా ఈ అంశంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించినా స్పందన లేదు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా విలీనం అంశంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని బీఆర్ఎస్సే నేరుగా ప్రతిపాదన పెట్టినా.. తెలంగాణ బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే డీల్ ఆలస్యమవుతోందని ఢిల్లీ వర్గాలు గట్టిగా చెబుతన్నాయి. బీఆర్ఎస్‌తో తీవ్రంగా పోరాడిన ముగ్గు రు ఎంపీలు ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా సరే అది బీజేపీకి నష్టం చేస్తుందని గట్టిగా వాదిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని .. ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని వ్యతిరేకించే వారిని .. సముదాయించి అధికారిక ప్రకటన చేస్తారని చెబుతున్నారు.




అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నారు. భారత రాష్ట్ర సమితిని కేసీఆర్ ఓ రకంగా శూన్యం నుంచి పుట్టించారు. పిడికెడు మందితో ప్రస్థానం ప్రారంభించారు. అలాంటి పార్టీని ఆయన దేశంలోనే ప్రముఖ ప్రాంతీయ పార్టీగా మార్చారు. మరి ఇప్పుడు ఒక్క ఓటమికే ఆయన తన పార్టీని బీజేపీలో విలీనం చేస్తారా ? అని ఆలోచిస్తే.. చాన్సే ఉండదని ఎవరికైనా అర్థమవుతుంది. ప్రధాన ప్రతిపక్షంలో ఉంది బీఆర్ఎస్ పార్టీనే. దాదాపు39 శాతం ఓట్ షేర్ సాధించింది అసెంబ్లీ ఎన్నికల్లో. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తే కచ్చితంగా 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ దే అధికారం. అదే సమయంలో బీఆర్ఎస్‌కు నాయకత్వ సమస్య లేదు. కేసీఆర్ మళ్లీ మైక్ పట్టి..రోడ్లపైకి వస్తే ఆయన క్రేజ్ ఆయనదే. ఇంకో 10 పదేళ్లు ఆయన యాక్టీవ్ పాలిటిక్స్ ఉండగలరు. నీ భవిష్యత్ లీడర్లు గా ఒకరు కాదు ఇద్దరు కనిపిస్తున్నారు. హరిశ్ రావు, కేటీఆర్ లు ఆల్ రెడీ ప్రూవెన్ లీడర్స్. కేసులు.. ఆర్థిక పరిస్థితి ఇలా ఏం చూసినా బీఆర్ఎస్ పార్టీని విలీనం చేయడం అనే సమస్యే ఉండదని బీఆర్ఎస్ క్యాడర్ గట్టి నమ్మకం.ఓ వైపు క్యాడర్.. మరో వైపు పార్టీ భవిష్యత్ మధ్య బీఆర్ఎస్ అగ్రనాయకత్వం ఊగిసలాడుతోంది. ఏ నిర్ణయం తీసుకున్నా తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు ఖాయమని అనుకోవచ్చు

# డబుల్ ట్రబుల్

-మొదటిపేజీ తరువాయి

లబ్దిదారులకు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన చోట అనర్హుల పేర్లు జాబితాలో చేర్చి డ్రా తీశారనే విమర్శలు వెల్లువెత్తాయి. మరో 7513 ఇళ్ళ నిర్మాణమే చేపట్టలేదు. నిర్మాణాలు చేపట్టిన చోట చాలా వరకు పిల్లర్లు, స్లాబ్ దశలోనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల చివరి దశ పనుల్లో ఆగిపోయాయి.కరీంనగర్ సమీపంలోని చింతకుంట శివారులో ఏడు బ్లాకుల్లో ఆరు అంతస్థులతో అపార్ట్మెంట్ టైప్ లో 666 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తికాక బూత్ బంగ్లాలుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం పాలకుల పర్యవేక్షణ లోపంతో కొన్ని పునాదులకే పరిమితం కాగ, మరికొన్ని పూర్తైన లబ్దిదారులకు అందక నిరూపయోగంగా మారాయి. అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేసి నిరుపేదలకు అప్పగించాలని నిరుపేదలతోపాటు వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.అసంపూర్తిగా, నిరూపయోగంగా మారిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను సిపిఎం నాయకులు సందర్శించి అక్కడి వాస్తవిక పరిస్థితులను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. అందమైన భవనాలు చెత్తాచెదారంతో తాగుబోతులకు అడ్డాగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండడం చూసి అధికారుల తీరు పాలకుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై దృష్టి పెట్టి తక్షణమే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని నగర సిపిఎం కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో పేదలను సమీకరించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను ఆక్రమిస్తామని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, పంపిణీ నత్తనడకన సాగడానికి అధికారుల నిర్లక్ష్యం పాలకుల పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు మారిన పట్టించుకునే వారు కానరాక పూర్తయిన ఇళ్ళు నిరూపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తయిన ఇళ్లకు కాంట్రాక్టర్ కు చెల్లించాల్సిన డబ్బులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో పలు చోట్ల పనులు నిలిచిపోగా మరికొన్ని చోట్ల మంజూరై, నిర్మాణం చేపట్టిన ఇళ్ళు తక్కువ, ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో లబ్ధిదారుల ఎంపిక చేయడంలో ఎమ్మెల్యేలు మీనమేషాలు లెక్కిస్తున్నారు.ఏదేమైనా డబ్బుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ట్రబుల్ గా మారి నిరుపేదల పాలిట శాపంగా పరిణమిస్తుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పాలకులు మేల్కొని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తం అవుతోంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మనం కోరుకుందాం.

# నిలువునా కూలిన సుంకేశుల రిటైనింగ్ వాల్

**నల్గొండ :** లంగాణలో అతిపెద్ద, అతి పురాతన సాగునీటి ప్రాజెక్టు నాగార్జున సాగర్. కృష్ణానదిపై దీనిని నిర్మించారు. ప్రాజెక్టు ఎగువన శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు ఉన్నాయి. కర్ణాటక ప్రభుత్వం తర్వాత కృష్ణా నదిపై అల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు నిర్మించడంతో నాగార్జున సాగర్‌కు వరద తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టు కొన్నేళ్లుగా నిండడం లేదు. మరోవైపు వేసవిలో డెడ్ స్టోరేజీకి చేరుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు తాగునీరు అందం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని డెడ్ స్టోరేజీలో కూడా హైదరాబాద్‌కు తాగునీటిని తరలించేందుకు చేపట్టిన సుంకిశాల పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. పనులు జరుగుతున్నాయి. నాగార్జున సాగర్ నిండినా పంప్‌హౌస్‌లోకి నీళ్లు రాకుండా రక్షణగా కాంక్రీటు గోడ(రిటెయినింగ్ వాల్) నిర్మించారు. పది రోజులుగా సాగర్‌కు భారీగా వరద వస్తోంది. దీంతో పది రోజుల్లోనే ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి పూర్తిగా నిండింది. ఈ క్రమంలో ఆగస్టు 1న సుంకిశాల వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. పంప్‌హౌస్ వద్ద నిర్మించిన రిటెయినింగ్ వాల్ నిలువునా కుప్పకూలింది. దీంతో సుంకిశాల పంప్‌హౌస్ నీటమునిగింది. నిత్యం వందమందికిపైగా కూలీలు పని చేసే ఆ ప్రదేశం కండ్ల ముందే క్షణాల్లో జలంలో కలిసిపోయింది. కూలీలు షిఫ్టు మారే సమయంలో ప్రమాదం జరుగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటలకు ఈ ఘటన జరిగింది. జలమండలి అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అర గంట ముందు.. ఆర గంట తర్వాతగానీ కూలి ఉంటే.. భారీగా ప్రాణ నష్టం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.నాగార్జున సాగర్‌కు పది రోజులుగా నిత్యం 3 లక్షల క్యూసెక్కులకుపైగా వరద వస్తోంది. దీంతో జలాశయంలో నీటిబట్టం వేగంగా పెరిగింది. నీటిమట్టం కూడా భారీగా ఉన్న సమయంలో రక్షణ గోడ వెనక గేటును ఏర్పాటు చేసిం సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. గేటు ఏర్పాటు పనులు పూర్తిస్థాయిలో చేయలేదని తెలుస్తోంది. సాగర్‌లో నీటిమట్టం భారీగా తగ్గిన తర్వాతగానీ సుంకిశాల మరమ్మతులు మొదలయ్యేలా లేవు. ఎండకాలం వరకు పనులు చేపట్టే అవకాశం లేదని స్పష్టమవుతున్నది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం జలమండలి రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల కృష్ణ జలాలను నాగార్జున సాగర్ నుంచి తరలించడం కోసం ఏఎమ్మార్పీ ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి కోదండాపూర్ వద్ద నిర్మించిన నీటిశుద్ధి కేంద్రంలో శు ద్ధి చేసిన తర్వాత పైప్‌లైన్ల ద్వారా నగరానికి తరలిస్తారు. అయితే నాగార్జునసాగర్‌లో కనీసంగా 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఏఎమ్మార్పీ మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. అందుకే తరచూ వేసవిలో అత్యవసర మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సిన పరిస్థితి.జలాశయ డెడ్‌స్టోరేజీ సుమారు 492 అడుగుల నీటిమట్టం నుంచి కూడా జలాలను తరలించేందుకు వీలుగా సుంకిశాల పథకాన్ని చేపట్టారు. వాస్తవానికి ఇది 1980 దశకంలో రూపొందించిన పథకం కాగా.. స్థానిక రైతుల ఆందోళనలతో పక్కకుపెట్టారు. 2001?03లో చంద్రబాబు హయాంలో సుంకిశాల పథకాన్ని పక్కనపెట్టి, ఏఎమ్మార్పీ ద్వారా నగరానికి కృష్ణాజలాల తరలింపు పథకం మొదటి దశ పనులను పూర్తి చేశారు. అనంతరం కాలక్రమేనా మరో రెండు దశలు పూర్తయినా సుంకిశాల పట్టాలెక్కలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2,215 కోట్లతో ఈ పథకం పనులు మొదలయ్యాయి. గతేడాది డిసెంబర్ వరకు పనులు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు మందకొడిగా సాగుతున్నాయి.నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి సొరంగ మార్గం ద్వారా సుంకిశాల వద్ద నిర్మించిన పంపుహౌజ్ వరకు నీటిని తరలించి, అక్కడ మోటర్లతో లిఫ్టు చేసి, పైప్‌లైన్ల ద్వారా కోదండాపూర్ వరకు జలాలను తరలించడమనేది ఈ పథకం స్వరూపం. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ఆధారంగా తెరిచేందుకుగాను మూడు స్థాయిల్లో (ఒక్కో లెవల్‌లో ఒక్కోటి చొప్పున) మూడు సొరంగ మార్గాలను నిర్మించారు. అయితే మొత్తం పథకం పనులు పూర్తయి, మోటర్లను బిగించిన తర్వాత సొరంగాలను వంద శాతం పూర్తి చేస్తారు. అప్పటివరకు నాగార్జునసాగర్ వైపు కొంతమేర తవ్వకుండా వదిలివేస్తారు. తద్వారా సాగర్‌లోని నీళ్లు సొరంగంలోకి రాకుండా ఉంటాయి. అదేవిధంగా సొరంగాల ద్వారా పంపుహౌస్‌లోకి నీళ్లు వచ్చే ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యగా భారీస్థాయి రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) నిర్మించారు.

## కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుంది

-మొదటిపేజీ తరువాయి



వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు ఉన్నా అధిగమిస్తామని అన్నారు. లక్షా 75 వేల ఎకరాలు సాగులోకి మొదటి విడతలో తీసుకురాబోతున్నామని చెప్పారు. రైతుల రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.లక్షా 50 వేల నుంచి 2లక్షల వరకు బ్యాంకులో రుణం ఉన్న అన్నదాతలకు మాఫీ చేస్తామని, రూ.31వేల కోట్లు రైతులకు ఇచ్చే పరిస్థితి లేదని.. అయినా రైతుల ప్రభుత్వం కాబట్టి రుణమాఫీ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ. 2లక్షలకు పైగా రుణాలు దాటిన రైతులు నగదు చెల్లించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తామని అన్నారు. మొదటి విడతగా 4లక్షల ఇళ్లు అందజేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తామని అన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసం పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. హెల్త్ కార్డు... తెల్లరేషన్ కార్డులు త్వరలోనే ఇస్తామని ప్రకటించారు. ధరణీ అనే భూతంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దానికి మోక్షం కల్పిస్తామని తెలిపారు. అద్భుతమైన రెవెన్యూ చట్టం తీసుకుని రాబోతున్నామని స్పష్టం చేశారు. 80 వేలు పుస్తకాలు చదివిన దొరవారు సూచనలు చేస్తే పరిశీలించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం ప్రతి ఒక్కరి కలను నెరవేరుస్తుందని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూమి, నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు..: హరీశ్‌రావు



**హైదరాబాద్:** ప్రపంచ ఆదివాసీ దినోత్సం సందర్భంగా ఆదివాసీ, గిరిజనులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు.. మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు గుభాలిస్తున్నాయని చెప్పారు. గిరిజనులు, ఆదివాసీల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆదివాసీల మూడు డిమాండ్లయిన స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూముల పట్టాలను కేసీఆర్ నిజం చేశారని తెలిపారు. మావ నాటే మావ రాజ్.. మా తాండాలో మా రాజ్యం అనే ఆదివాసీల ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ 2,471 గూడేలను, తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి ఆదివాసీ గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చారని చెప్పారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆదివాసీ గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు వారికి 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. జల్.. జంగల్.. జమీన్ అన్న కొమురం భీమ్ నినాదాన్ని కేసీఆర్ నిజం చేశారన్నారు.

## కవిత జైలులో ఇబ్బంది పడుతోంది

-మొదటిపేజీ తరువాయి

తీహార్ జైలుకు వెళ్లి కవితతో ములాఖత్ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కవిత జైల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటి వరకు 11 కిలోలు తగ్గారని, బీపీ వచ్చిందని పేర్కొన్నారు. దాని వల్ల రోజూ రెండు టాబ్లెట్స్ వేసుకోవాల్సి వస్తుందన్నారు.

దేశంలో పొలిటికల్‌గా కొట్లాడాల్సి వచ్చినప్పుడు ఇలాంటివి తప్పవని చెప్పుకొచ్చారు. బెయిల్ కోసం నిన్న అప్పీల్ చేశామని, వచ్చే వారంలో వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. సిసోడియాకు వచ్చింది కాబట్టి మిగతా వాళ్లకు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జైల్లో ఖైదీలు 11 వేలు ఉండాల్సిన చోట 30 వేలు మంది ఉన్నారన్నారు. జైలు పరిశుభ్రంగా లేదన్నారు. జైలుకు వెళ్లి వచ్చిన వాళ్లు భవిష్యత్‌లో పెద్ద లీడర్లు అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఆగస్టు 15న రైతులను రుణ విముక్తి చేస్తాం..

-మొదటిపేజీ తరువాయి




లక్షన్నర వరకు రుణం ఉన్న వాళ్ళందరికి నేరుగా 12289 కోట్లు 16.29 లక్షల కుటుంబాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. రెండు లక్షల వరకు ఆగష్టు 15లోపు చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఆగస్ట్ 15లోపు రుణాలు వైరాలో భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. వైరా నుంచి ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చాలెంజ్ చేశారని.... కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం వైరా సభలో రైతులు పండుగ లాగా పాల్గొని మన రైతాంగ సోదరులు మంచి సందేశం ఇచ్చేలా సభ జరుపుతామన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో రుణ మాఫీ ఒక్కటే కాదు... రైతు భీమాకి సంబంధించి ఒక వెయ్యి , 500 కోట్లు రైతుల తరుపున ప్రభుత్వం కడుతుందన్నారు. క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నామన్నారు. రైతులు కట్టాల్సిన రూ.1,350 కోట్లు కడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72 వేల కోట్లు కేటాయించామన్నారు. పండే ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఉద్యానవన పంటలు, డ్రిప్, సింప్లన్‌కు ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామన్నారు. రూ.1,450 కోట్లతో పూర్తి చేసే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ పేరు పెట్టి కేసీఆర్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లుకు పెంచి దోపిడీ చేసిందని ఆరోపించారు. ఆనాటి నుంచి కాంగ్రెస్ ఖండిస్తూ వస్తోందన్నారు. రూ.8 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఒక ఎకరాకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రుల సమక్షంలో రివ్యూ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో నీళ్ళు పారించే విధానంతో అతి తక్కువ ఖర్చుతో కేవలం రూ.75 కోట్లతో లక్షన్నర ఎకరాలు పండించేలా సీతారామ ప్రాజెక్ట్ లింకు కెనాల్‌తో పనులు చేశామన్నారు. ఎన్ఎస్పీ లింకు , వైరా కెనాల్‌కు లింకు కలపటమే రేపటి కార్యక్రమమని... ఇదీ మా నిబద్ధతకు తార్కాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# సనాతన వైదిక ధర్మపరిరక్షకులు

శాస్త్రార్థాన్ని చెపుతూ ఎదుటివాణ్ణి ఆచారమునందు ప్రవేశపెడుతూ తాను కూడా ఆచరించేవాడు ఆచార్యుడు. ఇది నూరుపాళ్ళు గురువులకే గురువు మాణిక్య సోమయాజులుకు అన్వయిస్తుంది.వేద విద్యావ్యాప్తి కోసం కృషిచేసినవారిలో భారతదేశంలోనే మాణిక్య సోమయాజులు అగ్రగణ్యులు. చతుర్వేదాలకు భాష్యం చెప్పగల పాండిత్యం ఆయన సొంతం. తెలంగాణలోనే ఏకైక సోమయాజిగా వేల మంది శిష్య పరంపర కలిగిన గురువు విద్వదాహితాగ్ని బ్రహ్మశ్రీ పట్లూరు మాడుగుల మాణిక్య సోమయాజులు గుర్తింపు పొందారు. నిగూఢమైన వేదరహస్యాలను కథలుగా, సరళ పదాలలో వివరించగల చెప్పగల పాండిత్యం ఆయనది. వేలాది శిష్యలను వేదవిదులుగా తీర్చి దిద్దిన గురువరేణ్యుడాయన. వైదిక యజ్ఞాలకు పునఃప్రాణప్రతిష్ఠ చేసిన యాజ్ఞికుడాయన. పీఠాధిపతుల సత్కారాలు, బిరుదాలు పొందిన మహోపాధ్యాయుడాయన. అంతెత్తు ఎదిగినా వినయంగా ఒదిగిన వినయభూషణుడాయన. వేదవిద్వన్మూర్తి మాణిక్య యాజులు వేదవిద్యానిధి, విద్వదాహితాగ్ని, జ్యోతిరప్తోర్యామ యాజిగా ప్రసిద్ధులాయన. వేద, శాస్త్ర, జ్యోతిష, అలంకార, వేదాంత, శ్రౌత మొదలైన ఎన్నో శాస్త్రాల్లో అఖండ పాండిత్యమున్నా తొణికిసలాడని నిండుకుండ ఆయన. నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణలో వైదిక సంప్రదాయ విద్యలు అడుగంటి పోయిన సమయంలో కన్నతల్లి పట్టుదల, ప్రేరణ, కృషితో వేదవిద్యను అభ్యసించి, వైదిక విజ్ఞాన ఖనిగ రూపు దాల్చారు. పట్లూరు సోమయాజీ అనే పేరుతో ప్రసిద్ధులైన ఆయన జీవితం ఈనాటి వేద విద్యార్థులకు, శాస్త్ర విద్యార్థులకు ఆదర్శప్రాయం. ఆయన పూర్వీకులందరూ వేద విద్యా పారంగతులే. ముత్తాత గంగాధర దీక్షితులు, తాత రామకృష్ణ సోమయాజి, తండ్రి పురుషోత్తమ సోమయాజి సంప్రదాయ వేదవిద్యను అధ్యయనం చేసినవారే. 1941లో మాడుగుల పురుషోత్తం సోమయాజి, జానాబాయి దంపతులకు 13వ సంతానంగా పట్లూరు గ్రామంలో జన్మించారు. నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణలో వైదిక సంప్రదాయ విద్యలు అడుగంటిపోయిన కష్ట కాలంలో కన్నతల్లి పట్టుదలతో, ప్రేరణతో, కృషితో వేదవిద్యను అభ్యసించి, నేటిదాకా తెలంగాణలో విశిష్టస్థానాన్ని అలంకరించిన వేదవిద్యానిధి బ్రహ్మశ్రీ మాడుగుల మాణిక్య సోమయాజులు. 'పట్లూరు సోమయాజి' అనే పేరుతో ప్రసిద్ధులైన ఈ మహనీయుని జీవితం ఈనాటి వేదవిద్యార్థులకు, శాస్త్ర విద్యార్థులకు ఆదర్శపాత్రం. పట్లూరి సోమయాజి కుటుంబంలోని పూర్వ పురుషులందరూ వేదవిద్యా పారంగతులే. ముత్తాల గంగాధర దీక్షితులు, తాత రామకృష్ణ సోమయాజి, తండ్రి పురుషోత్తమ సోమయాజి అందరూ సంప్రదాయిక వేదవిద్యను అధ్యయనం చేసినవారే. తండ్రి కేవలం వేదంలోనే కాక, మీమాంసా వాస్త్రంలోను, వ్యాకరణ శాస్త్రంలోనూ దిట్ట. ఇలా ఉన్నత విద్వత్కుటుంబంలో 13వ సంతానంగా జన్మించిన మాణిక్య సోమయాజికి శిశు ప్రాయంలోనే తండ్రి మరణించారు. తండ్రి మరణంతో కలిగిన లోటును తీర్చడానికి తల్లి జనాబాయి కంకణం కట్టుకున్నది. అప్పటికి తెలంగాణలో వేదాధ్యాపనం చేయించే గురువులు స్వల్పంగా ఉండడం, సామాజిక వాతావరణం అనుకూలంగా లేకపోవడాన్ని గమనించి, ఎంతో శ్రమకోర్చి



మాణిక్య సోమయాజిని, ఆయన అన్న నరసింహశాస్త్రిని గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా చవటపాపయ్య పాలెం అగ్రహారంలోని వేద గురుకులానికి చేర్చింది. అక్కడ ఆమెకు ఎన్నో పరీక్షలు ఎదురయ్యాయి. నిజాం ప్రాంతం వారికి ప్రవేశం లేదనే నిషేధోక్తులు గుచ్చినా వెరువక పట్టుదలతో వేదనిధులను ఒప్పించి, తన తనయులకు వేదవిద్యాభ్యాసానికి సిద్ధం చేసింది. ఆమెకు వేదవిద్యపట్ల గల ఆసక్తిని, శ్రద్ధను గమనించి గురువులు ఇద్దరు వేద పిల్లలకు వేదపాఠశాలలో ప్రవేశం కల్పించారు. అక్కడే సంహిత వరకు అధ్యయనం కొనసాగింది. అవాంతరాలకు నిరాశ చెందక
పిల్లలను బాపట్లలోని గొల్లపూడి మధుసూదన అవధాని దగ్గర మిగిలిన వేద భాగాన్ని పూర్తి చేయించింది. తరువాత రేపల్లెలోని తూములూరి సుబ్బావధాని దగ్గర పదం, క్రమం, బ్రాహ్మణ, ఆరణ్య భాగాలు, ఉపనిషత్తులు పూర్తి చేయించి వేదవిద్యలో తీర్చిదిద్దింది.17 ఏళ్ల వయస్సులోనే వేదశాస్త్ర సభల్లో విజయం సాధించే విధంగా తనయుణ్ణి తీర్చిదిద్దింది తల్లి...ఆ తరువాత స్వగ్రామానికి చేరుకుని వేదవిద్యా ప్రచారం కోసం కంకణం కట్టుకున్నారు. అప్పుడే కర్ణాటక రాష్ట్రం హుమ్నాబాద్ సమీపంలోని ఖనేరంజోల్ గ్రామానికి చెందిన రామచంద్ర భట్ గారి కుమార్తె లలితతో వివాహం జరిగింది. తరువాత గృహస్థాశ్రమంలో విద్యుక్త ధర్మాలను కొనసాగిస్తూ ప్లవంగ నామ సంవత్సరంలో సోమయాగాన్ని నిర్వహించి 'సోమయాజి'గా సార్థక కీర్తిని అందుకున్నారు. ఇస్మాయిలా?న్ పేటలో శాస్త్రుల విశ్వనాథ శాస్త్రి ప్రేరణతో ప్రారంభమైన వేదవిద్యా పాఠనోద్యమంలో చేరి శివంపేటలోని వేదపాఠ శాలలో ఆచార్యులై వందలాది మంది శిష్యులకు వేదవిద్యలోను, శాస్త్ర విద్యలోనూ, యజ్ఞయాగాది ధార్మిక సంస్కారాల లోను తీర్చిదిద్దిన మహాతపస్వి మాణిక్య సోమయాజి. సోమయాజి దేశంలోనే వేదానికి భాష్యం చెప్పగల అతికొద్దిమంది విద్వన్మూర్తులలో అగ్రగణ్యులు. ఇటీవల గోదావరి పుష్కరాల సమయంలో శ్రౌతసంవర్ధినీ సభ ఆధ్వర్యంలో ధర్మపురి క్షేత్రంలో జరిగిన జ్యోతిరప్తోర్యామం ఉత్కృష్ట సోమయాగం వీరి యాజమాన్యంలో వైభవంగా జరిగింది. కృష్ణా పుష్కరాల సమయంలో బీచుపల్లిలో బ్రహ్మశ్రీ మాడుగుల శశిభూషణ శర్మ సోమయాజి యాజమాన్యంలో జరిగిన అగ్నిష్టోమ సోమయాగం పట్లూరి గురువుగారి పర్యవేక్షణలోనే జరిగింది. ఐదేళ్ల క్రితం తొగుట శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠంలో శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామివారి ఆశీస్సులతో జరిగిన చాతుర్మాస్యేష్టి శ్రౌతయాగం మాణిక్య సోమయాజులు – లలితా సోమిదేవమ్మ యాజమాన్యంలోనే జరిగింది. బ్రహ్మశ్రీ మాణిక్య సోమయాజులు గారి వైదిక నిర్వహణలో తెలుగునాట సహస్రాధిక యాగాలు ఆలయాల ప్రతిష్ఠలు జరిగాయి. 2012లో హైదరాబాద్ శివార్లలోని మేడ్చల్ జిల్లా షామీర్పేట మండలం అలియాబాద్లోని పురాతన శ్రీ రామచంద్రస్వామి దేవస్థానంలో లక్ష రుద్ర మహాయాగాన్ని అద్వితీయంగా నిర్వహించారు. సికింద్రాబాద్ కానాజీగూడ లోని మరకత శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో లక్ష మోదక గణపతి హోమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాటి గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా వీరికి విశిష్ట సేవా పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన అయుత చండీయాగంలో స్వర్ణ కంకణంతో సత్కారం జరిగింది. వివిఎస్ఆర్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవంలో 'వేదవిద్యానిధి' పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

వారణాసి (కాశీ) విశ్వనాథుని సన్నిధిలో ఉంటూ అక్కడే అనేక ధార్మిక ప్రవచనాలను, వేదవేదాంత బోధనలను అందిస్తూ ధార్మిక జీవనాన్ని గడిపారు. ఆ సమయంలో తెలంగాణ నుంచి కాశీక్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం దాతల విరాళాలతో కేదార్ఘాట్లో 400 గజాల స్థలాన్ని సేకరించారు. గంగాతీరంలో భూదానం కార్యక్రమం నిర్వహించి, కొన్నాళ్ల క్రితం తిరిగొచ్చారు. సన్యాసాశ్రమం స్వీకరించడానికి ముందు తాను నిష్క్రమించే సమయం ఆసన్నమైనదని శిష్యులతో చెప్పడం ఆయన దివ్యదృష్టికి నిదర్శనం. సోమయాజులు 2021 ఆగస్టు 9 సోమవారం తెల్లవారు జామునే సన్యాస ఆశ్రమాన్ని స్వీకరించి శ్రీ బ్రహ్మానంద తీర్థ మహాస్వామిగా దీక్షానామం పొందారు. విధివశాత్తు సాయంత్రమే పరమ పదించారు.

## సంపాదకీయం

# బయోఫ్యూయెల్‌కు ప్రోత్సాహం ఏదీ?

జీవఇంధన వాడకం మానవునికి కొత్తేమి కాదు. మానవుడు మొదట నిప్పును సృష్టించిన తరువాత ఎండిన కర్రపుల్ల లు, చెట్లకాండాలు, ఆకులను నిప్పు పుట్టించే ఇంధనంగా వాడటం ప్రారంభించాడు. తరువాత జంతు, మొక్కల నుండి తీసిన నూనెలను కూడా ఇంధనంగా వాడేవాడు. ఆ తరువాత ఇళ్ళలో వంటలకు, ఇత రత్రా పనులకు కర్రలను, కర్రలను కాల్చగా ఏర్పడు బొగ్గులను ఇంధనంగా వాడటం అలవాటు చేసుకున్నాడు. ప్రస్తుతం విచ్చలవిడిగా అవసరానికి మించి వాడుతున్న నేలబొగ్గు (భూమిగర్భం నుండి త్రవ్వితీసిన బొగ్గు), ముడిపెట్రోలియం నుండి ఉత్పత్తి గావించే ఖనిజ నూనెలు, వాయువులు, పెట్రోలియం బావుల నుండి ప్రారంభంలో వెలువడు సహజ వాయువు వంటివి అన్నియు శిలాజ ఇంధనాలు. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమిమీద ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో భారీ ప్రమాణంలో భూమి మీది జీవరాశి అంతమయి, క్రమేనా భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. ఇప్పటికే 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. ఉత్పత్తి ఐన వస్తువులు వేగంగా వినియోగ ప్రాంతాలకు చేరనిచో అభివృద్ధి కుంటు పడుతుంది. జన జీవనం అస్తవస్తం అవుతుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ఔీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడును. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడును. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడును.భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టియందు ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. తత్ఫలితంగా బెంగుళూరు పరిసర ప్రాంతాలతో ముందుగా ట్రాక్టర్లను బయో డీజిల్ తో నడపడం జరిగింది. యూరోపియన్ దేశాలలో ఉత్పత్తి అయిన డీజిల్ లో 2శాతం బయో డీజిల్ ను మిశ్రమిస్తున్నారు. గత భారత ప్రభుత్వం కూడా మొత్తం రవాణా ఇంధనాలుగా జీవ ఇంధనాలను 20శాతానికి పెంచాలనే లక్ష్య నిర్దేశం చేసింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. ఈ క్రమంలోనే 2006- 08 మధ్య కాలంలో రాష్ట్రంలో జీల ఇంధన మొక్కల పెంపకాన్ని చేపట్టారు. లక్ష ఎకరాలలో జీవ ఇంధన మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం రైతులు, స్వచ్ఛంద సంఘాలను, పంచాయతీలను ప్రోత్సహించింది. ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు సాయం చేయాలని నిర్ణయించారు. భారత ప్రభుత్వం కానుగ 6రూపాయల మద్దతు ధరలు నిర్ణయించింది. బయోడీజిల్ కొనుగోలు రేటును 25రూపాయలు నిర్ణయించింది. పంట వేసుకోవడానికి 40% బ్యాంకు ద్వారా, 60% సబ్సిడీ అందించే చర్యలు చేపట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకం, ఇందిర ప్రభ వాటర్ షెడ్ పథకం ద్వారా చేపట్టు ఎస్సీ, ఎస్టీ అసైన్ భూములు 100% రాయితీ కల్పిస్తామని ప్రకటించింది. స్వశక్తి మహిళా సంఘాలచే ప్రభుత్వ బీడు భూములలో చేపట్టుటకు 100% రాయితీ అందిస్తామంది. ప్రతి వంద రైతులకు అనుసంధాన కార్యకర్తలకు నెలకు 1500 చొప్పున ఏర్పాటు చేసే నిర్ణయం గైకొంది. ప్రతి మండలానికి ప్లాంటేషన్ మేనేజర్, బయోడీజిల్ కొరకు 4వేల రూపాయలు కేటాయించారు. ప్రభుత్వ భూములలో కానుగ మొక్కలను పెంచడం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ సంఘాలకు, పంచాయితీ లకు, అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బ్లాక్ అండ్ అవెన్యూ ప్లాంటేషన్ పై రాష్ట్రంలో కోట్లు ఖర్చు చేశారు. 2007-08 లో కొనసాగించారు. ఇందిర ప్రభ అటకెక్కగా, సబ్సిడీలు మటు మాయమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించినట్లు పంటకు మద్దతు ధర చెల్లించడం కానీ కొనుగోలు చేసిన దాఖలాలు లేనేలేవు. కోట్లాది రూపాయల అంచనాలతో ప్రణాళికా బద్ధంగా మొక్కల పెంపుదలకు కార్యాచరణ రూపొందించి అట్టహాసంగా పెంపకములను చేపట్టినా, అది ఆచరణ శూన్యమే అయింది.

## బహుముఖ ప్రజ్ఞాశాలి సామల సదాశివ

ఎక్కడో దూరంగా సభ్య సమాజానికి బహు దూరంగా, విద్యాగంధం అంతగా సోకని, అభివృద్ధి అంటే తెలియని మారుమూల ప్రాంతంలో పురుడు పోసుకుని, స్వయం కృషితో, తెలంగాణ కవుల్లో కాళోజీ తర్వాత అంతటి గుర్తింపు తెచ్చుకున్న అసమాన ప్రతిభ గల సాహితీవేత్త సామల సదాశివ. సాహిత్యంలోనే కాక సంగీతం, చిత్రలేఖనంలో కూడా అపారమైన ప్రతిభను, బహు భాషల్లో ప్రావీణ్యం కలిగిన ప్రతిభాశాలి. ఉర్దూ, పార్శీ, మరాఠీ, హింది సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించారు. తెలుగు తీయదనాన్ని ఉర్దూ వారికి, ఉర్దూ నుడికారపు మాధుర్యాన్ని తెలుగువారికి రుచి చూపించిన గొప్ప అనువాదకుడు. సదాశివ రాసిన విమర్శనా వ్యాసాలు పలు తెలుగు, ఉర్దూ పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా ప్రచురితం అయ్యాయి. హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రాల ద్వారా ఎన్నో ప్రసంగాలు ప్రసారమైనాయి. ఏడవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో గిరిజన వీరుడు కొమురంభీం పాఠాన్ని రాసి తెలుగువారికి భీంను పరిచయం చేశారు. "కొమురం భీము" సినిమా నిర్మించిన అల్లాని శ్రీధర్... "సదాశివ గారికి కృతజ్ఞతలతో".. అని రాసి తమ అభిమానాన్ని చాటు కున్నారు. సామల సదాశివ (మే 11, 1928 – ఆగష్టు 7, 2012) కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. తెలంగాణకు చెందిన తెలుగు, ఉర్దూ రచయిత, హిందుస్తానీ సంగీత పండితుడు. హిందుస్తానీ సంగీతాన్ని తొలిసారిగా తెలుగు పాఠక లోకానికి పరిచయం చేసిన తొలి తెలుగు రచయిత. సామల సదాశివ దహెగాం మండలంలో తెనుగుపల్లెలో 1928, మే 11న జన్మించారు. ఆయన తల్లిదంపూడులు సామన నాగయ్య పంతులు, చిన్నమ్మలు. ఎంఏ, బీఎడ్, డీ లిట్ చదివారు. సదాశివ ఉపాధ్యాయునిగా తొలుత కాగజ్ నగర్లోలోవిధులు నిర్వర్తించారు . ఆయన శిష్యులు ఈనాటికీ మాస్టారు అని గౌరవంగా చెప్పుకుంటారు. డైట్ కళాశాల, ఆదిలాబాద్ ప్రిన్సిపాల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. సంస్కృత పండితులు కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారి వద్ద వ్యాకరణాంశాలు నేర్చుకొని గొప్ప పండితునిగా వాసి కెక్కారు. వేలూరి శివరామశాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, డాక్టర్ దాశరథి. డాక్టర్ గోపి వంటి పండితులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సదాశివను గురువుగా గౌరవించేవారు. సదాశివ ఎప్పుడు వరంగల్ వెళ్లినా, జయశంకర్ ఇంట్లోనే అతిథిగా ఉండేవారని మాస్టారు యాది పుస్తకంలో పేర్కొన్నారు. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, ఫారసి, మరాఠీ భాషలలో ఆయన పాండి త్యాన్ని సాగించారు. ఉర్దూ, ఫారసీ, హిందీ, మరాఠీ భాషలకు చెందిన ప్రసిద్ధ కవుల, రచయితల సాహిత్యాన్ని ఆయన అనువదించారు. మూడు వందల వ్యాసాలు ఉర్దూలోనూ, 450 వ్యాసాలు తెలుగులోనూ రాసి ప్రముఖ దిన, వార, పక్ష, మాస పత్రికలలో ప్రచురించబడ్డాయి. హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, విశాఖపట్నం, ఆదిలాబాద్, ఆకాశవాణి కేంద్రాల నుంచి అసంఖ్యాక ప్రసంగాలు, ఇంటర్వ్యూలు ఇచ్చారు. సామల సదాశివ 1963 నుంచి 1983 వరకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉర్దూ సలహా సంఘం సభ్యులుగా, 1991 నుంచి 1994 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా పని చేశారు. ఆయన చేసిన అంజత్ రుబాయిలు అనువాదానికి 1964లో గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అనువాద రచనగా ఉంది. 1968లో పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం. 1994లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రతిభా పురస్కారం, 2002లో కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం, 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్8 రాజశేఖర్ రెడ్డి ప్రతిభా రాజీవ పురస్కారం ప్రదానం. 2011, డిసెంబర్ 21న స్వరలయలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించి ఫిబ్రవరి 14న ఢిల్లీలో ప్రదానం చేశారు. సదాశివ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో ప్రవేశించి ప్రిన్సిపల్ గా రిటైర్ అయ్యి ఆదిలాబాదు పట్టణంలో స్థిరపడి సదాశివ 2012 ఆగస్టు 7న ఆగస్టు 2012 శ్రావణ బహుళ పంచమిన గుండెపోటుతో శాశ్వతంగా ఈ లోకాన్ని వీడి వెళ్ళారు.

..............................

## దేశాన్ని ఊపేసిన నినాదం అది

భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన ఘట్టం, అనాడు దేశాన్ని ఊపేసిన నినాదమైన ఇండియా' (భారత్ ను వీడిపోండి' అనే నినాదాన్ని సూచించింది నాటి ముంబై మేయర్ మెహరల్లీ. సోషలిస్టు నాయకుడైన ఆయన దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఎనిమిది సార్లు జైలుకెళ్లారు. ఉద్యమం నాటికి ముంబై మేయర్‌గా పనిచేస్తున్న 39 ఏళ్ల యూసుఫ్ మెహరల్లీ. మేయర్ పదవికి ఎన్నికైన తొలి సోషలిస్ట్ మెహరల్లీ. ఆయన స్వాతంత్ర్యోద్యమానికి ఊపునిచ్చిన 'క్విట్ ఇండియా' అనే పదం ఎలా పుట్టుకొచ్చిందో కే. గోపాలస్వామి రాసిన 'గాంధీ అండ్ బాంబే' పుస్తకంలో వివరించారు. దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహ రచన చేస్తున్న మహాత్మాగాంధీ తన సహచరులతో ముంబైలో సమావేశమైనప్పుడు స్వాతంత్ర్య పోరాటానికి పనికి వచ్చే మంచి నినాదాలను సూచించాల్సిందిగా వారిని కోరారు. అందుకు 'గెటవుట్' అని ఎవరో సూచించారు. అదంత మర్యాదగ లేదని గాంధీ తిరస్కరించారు. 'రిట్రీట్ ఆర్ విత్ డ్రా' అన్న పదాన్ని రాజగోపాలచారి సూచించారు. అక్కడే ఉన్న యూసుఫ్ మెహరల్లీ 'క్విట్ ఇండియా' పదాన్ని సూచించారు. బాగుందని గాంధీజీ మెచ్చుకున్న వెంటనే ఆ పదాన్ని ఆమోదించారు. 1942 ఆగస్టు 8న ముంబయిలోని గొవాలియా బ్యాంక్ మైదానంలో జరిగిన సభలో ఆయన ఈ నినాదాన్ని ఇచ్చారు. 'క్విట్ ఇండియా' నినాదం భారత స్వాతంత్ర్య సమరాన్ని కొత్తపుంతలు తొక్కించింది. గాంధీజీ పిలుపు మేరకు ఆగస్టు 9 నుంచి 'క్విట్ ఇండియా' ఉద్యమం దేశవ్యాప్తంగా ఆరంభమైంది.గాంధీజీ దక్షిణాఫ్రికా నుండి భారత్ వచ్చాక దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య ఉద్యమం పలు రూపాల్లో విస్తరించింది. స్వపరిపాలన హోదా ఇవ్వకుంటే సత్యాగ్రహం ఉధృతం చేస్తామన్న తీర్మానాలు, రాజకీయ అసంతృప్తి, లాహోర్లో జరిగిన చారిత్రాత్మక సమావేశంలో సంపూర్ణ స్వతంత్ర సాధన పిలుపునకు క్రమానుగత హేతువులయ్యాయి. 1930 జనవరి 26న దేశం మొత్తం 'సంపూర్ణ స్వాతంత్ర్య దినంగా పాటించాలని నిర్ణయం జరిగింది. అనంతర పరిణామాలతో దశాబ్దకాలం పాటు కొనసాగిన వివిధ ఆందోళనలు సత్యాగ్రహాలు, నిరసనలు, బాంబు దాడులు, విధ్వంసం క్రమంలో– 'క్విట్ ఇండియా' (భారత్ ను వీడిపోండి' అనే నినాదాన్ని గాంధీజీ ఇచ్చారు. క్విట్ ఇండియా' నినాదాన్ని సూచించింది. క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రకటించడానికి ఒక నెలకు ముందుగానే 1942 జూలై 14వ తేదీ నుంచి అఖిల భారత కాంగ్రెస్ సమావేశం పూర్తి స్వాతంత్ర్యం లభించాలని తీర్మానం చేసింది. 1942 ఆగస్టు ఎనిమిదో తేదీ ముంబైలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టాలని తీర్మానించింది. 1942 ఆగస్టు 8 న, బొంబాయిలో గోవాలియా ట్యాంక్ మైదానంలో చేసిన క్విట్ ఇండియా ప్రసంగంలో గాంధీ "డూ ఆర్ డై" కి పిలుపునిచ్చాడు. గాంధీ ప్రసంగించిన గంటల్లోనే భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వం మొత్తాన్నీ విచారణనేది లేకుండా జైల్లో వేసింది. వీళ్ళలో చాలా మంది జైలులోనే, ప్రజలతో సంబంధం లేకుండా గడిపారు. ఆల్ ఇండియా ముస్లిం లీగ్, రాచరిక సంస్థానాలు, ఇండియన్ ఇంపీరియల్ పోలీస్, బ్రిటిషు ఇండియన్ ఆర్మీ, హిందూ మహాసభ, ఇండియన్ సివిల్ సర్వీస్, వైస్రాయ్ కౌన్సిల్ (ఇందులో ఎక్కువ మంది భారతీయులు ఉన్నారు) లు బ్రిటిషు వారికి మద్దతుగా నిలిచాయి.ఉద్యమంలో పాల్గొన్న గాంధి, పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి పలువురు నాయకులను బ్రిటిష్ పోలీసులు అరెస్ట్ చేసి అహమ్మద్ నగర్‌లోని పోర్ట్ కారాగారంలో బంధించారు. అయితే ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించే నేతలు లేకపోవడంతో, యువ వీరవనిత అరుణా ఆసఫ్ అలీ ఈ కాంగ్రెస్ బహిరంగ సభకు నాయకత్వం వహించి, జెండా ఆవిష్కరణ గావించారు.1942 ఆగస్టు 9 నుండి 1942 సెప్టెంబరు 21 వరకు, క్విట్ ఇండియా ఉద్యమంలో స్థానిక నిర్ణయాల మేరకు 550 పోస్టాఫీసులు, 250 రైల్వే స్టేషన్లపై దాడి చేసారు. అనేక రైలు మార్గాలను దెబ్బతీసారు.

# ప్రజలందరూ "డ్రైడే- ఫ్రైడే "పాటించాలి

## రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి





**తుర్కయంజాల్, ఆగస్టు 09(శాసన సభ )** తుర్కయంజాల్ పురపాలక పరిధిలో ప్రజలందరూ ప్రతి వారం డ్రైడే-ఫ్రైడే పాటించాలని రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రాం రెడ్డి అన్నారు. శుక్రవారం "స్వచ్ఛదనం పచ్చదనం" కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాం రెడ్డి, కమిషనర్ అమరేందర్ రెడ్డి కౌన్సిలర్ల తో కలసి తుర్కయంజాల్, రాగన్న గూడ పరిధిలోని క శ్రీరాం నగర్ కాలనీ, జనచైతన్య నగర్, సాయి బృందావన్, వాసవి నగర్, వింటేజ్ హెూమ్స్, సాగర్ రెసిడెన్సీ, సరిగమ సిటీ, పగోడా ప్లాజాలలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. వచ్చే 3 నెలలో పుర పరిధిలోని అన్నీ కాలనీలలో మౌళిక వసతులు తప్పకుండా కల్పిస్తామనని తెలిపారు. పలు కాలనీలలో నిర్వహించిన " వన మహెూత్సవం " కార్యక్రమంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ,



డ్రైడే-ఫ్రైడేమంచి కార్యక్రమం, అందరూ తప్పక పాటించాలని కోరారు. చివరి రోజు "స్వచ్ఛదనం పచ్చదనం" లో పట్టణంలోని అన్నీ కాలనీలలో మొక్కలు నాటడం, ప్రభుత్వ సంస్థల శుభ్రం, శిథిలమైన భవనాల తొలగింపు, ప్రతి ఇంటికి మొక్కల పంపిణీ, వెక్టార్ మూలాల కోసం తనికి చేయడానికి టైర్ పంక్చర్ షాపుల తనిఖీ, స్క్రాప్ దుకాణాల తనిఖీ, యాంటీలార్వ స్ప్రే కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ "స్వచ్ఛదనం-పచ్చదనం" లో భాగస్వాములై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలలో వైస్ చైర్ పర్సన్ హరిత ధన్ రాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కౌన్సిలర్ అసోసియేషన్ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివ కుమార్,టి. పి. సి. సి సభ్యులు,కౌన్సిలర్ కాకుమన్ సునీల్, కౌన్సిలర్లు బొక్క రవీందర్ రెడ్డి,రేవల్లి హరిత యాదగిరి ,మర్రి మాధవి మహేందర్ రెడ్డి ఆర్.ఒ శ్రీనివాసులు, డి. ఈ.సత్యనారాయణ,ఏ. ఈ బిక్షపతి, శానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్, ఈ. ఈ హరీష్, ఆర్. పి లు, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒత్తిడి లేని చదువులు కావాలి

నేడు విద్యార్థి పరిసరాలతో మమేకమైన జ్ఞానానికి దూరమై మార్కుల మోజులో పడి బట్టీ చదువులను ఆశ్రయిస్తున్నాడు. ప్రస్తుత విద్యావిధానం ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు పోటీ ప్రపంచాన్ని అలవాటు చేయాలనే తపనతో ఎక్కువ శాతం విద్యా సంస్థలు పిల్లలను ఆట,పాటలకు కూడా తీరిక లేకుండా చేస్తూ విద్యార్థులకు ఒత్తిడి పెంచే విధంగా రూపుదిద్దుకుంది. ఈ ఒత్తిడితో కూడిన విద్య వల్ల ఆశించిన మార్కులు వస్తున్నాయనే భ్రమలో ఉన్నారే గాని ఆ మార్కులు విద్యార్థుల ఆలోచన విధానాన్ని మెరుగుపరిచేలా చేయలేవని గమనించే స్థితిలో చదువు అర్థం కానప్పుడు బట్టీసాధనం అవుతుంది. ఇంగ్లీషుమీడియం బడుల్లో భాష మీద పట్టురాకమునుపే ఆ భాషలో చదువుచెప్పటం వల్ల అర్థం కాదు. అర్థంకాని చదువుతో మార్కులుతెచ్చుకోవాలి అంటే పిల్లలకు బట్టీనేదారి. అర్థం చేసుకుని చదివితేఅరగంటలో అయ్యేపాఠానికి బట్టీపెట్టటం కోసం కొన్ని గంటలు కుస్తీపడాలి. పైగా బట్టీ పెట్టింది ఎక్కువకాలం గుర్తుండదు కనుక సేన పు మళ్ళీ దాన్ని తిరగతోడుతూ ఉండాలి. ఇందువల్ల చదువుకోసంమామూలుగా వెచ్చించాల్సినసమయం కంటే అదనపు సమయం కావాలి.

### వ్యక్తిత్వ వికాస విద్య అవసరం

బట్టి చదువు వల్ల బుద్ధివికాసానికి, వ్యక్తిత్వ ఎదుగుదలకు ఉపయోగపడే చదువేతర కార్యక్రమాలకు కోత పడుతుంది. ఇందువల్ల పరిస్థితులకు తగ్గట్టుసర్దుకుపోయే నైపుణ్యాలు ఈ తరంపిల్లల్లో పెంపొందటం లేదు. అవి కొంతమందిలో పెంపొందినా బడితో సంబంధం లేకుండా వారితల్లిదండ్రులు తీసుకున్న అదనపు జాగ్రత్తలవల్ల అయి ఉంటుంది. మార్కులతో సంబంధం లేనిఇలాంటి నైపుణ్యాలను నేర్పే తీరికా,అవసరమూ ప్రస్తుత బడులకులేదు. మార్కులు వస్తున్నాయాలేదా అన్నదే వారికి గీటురాయి.

### గుది బండలా చదువు ఒత్తిడి

బిడ్డలు ఎదిగాక, జీవితంలోఎదురయ్యే చిన్న చిన్న ప్రతికూలపరిస్థితుల్ని కూడా ఎదుర్కొనేచేవలేనివారుగా, సామాజికచైతన్యం లేనివారుగా తయారు అవుతున్నారు. అందుకనే పాతికేళ్ళకు మునుపుకనీ వినీ ఎరగని "చదువు ఒత్తిడి"అనే గుదిబండ ఇపుడు పిల్లలమెడలో వేలాడుతోంది.

### ఇంకా బ్రిటిష్ వారి విద్యావిధానాలే

విద్య వంటి అనేక విషయాల్లో బ్రిటిష్ వారి విధానాలనే ఇప్పటికీ అవలంబిస్తున్నాం. గుమస్తా గిరికిఅవసరం వచ్చే చదివే నేర్చుకుంటున్నాం. వీటికి తోడు ఇప్పటి జీవనానికి దూరంగా, మామూలు జీవితానికి సంబంధం లేని పాఠాలు, బయటికి వచ్చాక తరగతి గదిలో నేర్చుకున్నది నిజజీవితంలో ఎక్కడ ఉపయోగపడ్తుందో తెలియక ఎంతో మంది విద్యార్థులుఅయోమయానికి గురి అవుతున్నారు.



### స్వేచ్ఛ లేని చదువు

ఫ్యూచర్ లో ఏమవ్వాలి అని ఆలోచించుకొనే స్వేచ్ఛ తల్లిదండ్రులు ఇవ్వడం లేదు. విద్యాసంస్థలు ఆ చిన్నపాటి కలల్ని వీక్లీ టెస్ట్ లు, స్పెషల్ క్లాసులు అంటూ చంపేస్తున్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను పరిగణనలోకి తీసుకోకుండా విషయజ్ఞానాన్ని పిల్లలపై రుద్దడం జరుగుతుంది. నేటి విద్యాసంస్థలు బట్టీ చదువులతో ర్యాంకులను, మార్కులను చూపెడుతూ సమాజాన్ని మెప్పించే సంస్కృతినీ పెంచి పోషిస్తున్నారు.

### ఒత్తిడితో ఆత్మహత్యలు

ప్రతి ఏడాది వందల సంఖ్యలో విద్యార్థులు మార్కుల టెన్షన్ తో, ఇంట్లో/కాలేజ్ ప్రెజర్ తో మానసికంగా ఒత్తిడికి లోనవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మార్పు రావాలి ఈ విద్యార్థుల బలవంతపు చావులు ఆపాలంటే మార్పు రావాల్సింది విద్యార్థుల్లో మాత్రమే కాదు. లక్షల మొత్తం ఫీజులు దొబ్బేసి.. విద్యార్థులను గంటలకు గంటలు క్లాస్ రూమ్స్ లో ఉంచేసి వారి బుర్ర టెక్స్ట్ బుక్స్ తప్ప మరో విషయం గురించి లోజింపనివ్వని విద్యాసంస్థల్లో మార్పు రావాలి. ఎక్కువ మార్కులు రావాలని తమ బిడ్డలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న తల్లిదండ్రులలో మార్పు రావాలి. ధనార్జనే ధ్యేయంగా విద్యా సంస్థలను నడుపుతున్న యజమానుల్లో మార్పురావాలి. మార్కులతో విద్యార్థిని అంచనావేసే పరీక్షా విధానంలోమార్పు రావాలి. ప్రభుత్వ కరికులం లో మార్పు రావాలి.

### తగిన విశ్రాంతి అవసరం

తగినంత నిద్ర విశ్రాంతి కూడా లేకుండా గంటల తరబడి చదివితే ఆరోగ్యం పాడయి తగిన నిద్ర లేకపోవడంవలన బుర్ర మొద్దుబారి చదివిన విషయాలు గుర్తురాక చివరికి చదివిన ప్రయోజనం కూడా దక్కకుండా పోయే ప్రమాదం ఉంది.

### సరళం నుండి క్లిష్టమైనవి నేర్చుకోవాలి

విద్యార్థులు పెరిగేకొద్దీ వాళ్లు నేర్చుకోవలసిన జ్ఞాన, నైపుణ్య విధానాలను కూడా విద్యావేత్తలు క్రోడీకరించారు. అంటే చిన్నప్పుడు సరళమైనవిధంగా పెరిగేకొద్దీ క్లిష్టమైనవిధంగా నేర్చుకోవాలి. చదువు ముగిసే సమయానికి సంక్లిష్టమైన విషయాలను అర్థంచేసుకోవడమేకాక అంతకంటే సంక్లిష్టమైనవి రూపొందించాల్సిన బాధ్యతకూడా ఎప్పటికప్పుడు విద్యార్థుల మీద ఉంటుంది. ఉదాహరణకు వేదకాలంలోనే పిల్లలు ఒక చదువుకునే విషయాన్ని 25% ఉపాధ్యాయుడి (తల్లిదండ్రులుకూడా కావచ్చు) ద్వారా, 25% ఇతరపిల్లలతో చర్చించడం ద్వారా, 25% స్వంతంగా, చివరి 25% ఉత్తరోత్తర కాలంలో (లోతుగా ఆలోచించడం, అనుభవాలు, పరిశోధనలద్వారా) నేర్చుకుంటారని ప్రమాణీకరించారు. ఇప్పుడు మొత్తం విషయాన్ని (100%) స్కూల్లో టీచరుద్వారానే నేర్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఎంత అసమంజసమో వేరే చెప్పక్కర్లేదు.

### వివిధ పద్ధతుల్లో అభ్యసనం అవసరం

ఆధునిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం పిల్లలు వివిధ పద్ధతుల్లో నేర్చుకుంటారు. కొంత మాటల ద్వారా, మరికొంత బొమ్మలద్వారా (చిత్రాలు, గ్రాఫులు వీడియోలు), కొంత సమాచారం ద్వారా మరికొంత ఆలోచన ద్వారా, కొంత వెంటనే, మరికొంత నిదానంగా ఇలా వివిధరకాలుగా. కాబట్టి చదువునేర్పే ఇవన్నీ ఉన్నప్పుడే నేర్చుకోవడం సంపూర్ణమౌతుంది.

### పిల్లల మానసిక స్థితి ఆధారంగా విద్య అందివ్వాలి

పిల్లల మానసిక పరిపక్వత ఆధారంగా విద్యనందించే సంస్కృతి ప్రతి పాఠశాలలో కొనసాగాలి. ఆధునిక కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకున్న శాస్త్రీయ కరికులాన్ని నేడు పిల్లలకు అందించవలసిన అవసరం ఉంది విద్య అనేది విషయ పరిజ్ఞానానికి పరిమితం కాకుండా ఆటలు, పాటలు లాంటి వినోద కార్యక్రమాల ద్వారా పిల్లల్లోని ప్రతిభను వెలికితీయాలి. పిల్లలకు పాఠ్యాంశాలు బోధించేటప్పుడు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉపాధ్యాయ విద్యలో ఉన్న బోధనా పద్ధతులను అవలంబిస్తూ విద్య సామర్థ్యాలను సాధించాల్సిన అవసరం ఉంది. ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యారంగ నిపుణులు సూచించిన శాస్త్రీయ కరికులంతో కూడుకున్న ప్రభుత్వ పుస్తకాలను వినియోగిస్తూ ప్రైవేట్ పాఠ్యపుస్తకాలను నిషేధించాలి. అప్పుడు విద్యార్థులపై ఒత్తిడిని తగ్గి సృజనాత్మకతతో కూడుకున్న విద్యా విధానానికి బాటలు పడతాయి.

పిన్నింటి బాలాజీ రావు
భౌతికరసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు
హనుమకొండ , 9866776286

# మాల్ వీటినగర్‌లో బాలాజీ ఈ- బైక్ షోరూం ప్రారంభం

## కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య షో రూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్




**చింతపల్లి, ఆగస్టు 9 శాసనసభ న్యూస్:** చింతపల్లి మండలం మాల్ విటీ నగర్ లో బాలాజీ ఈ- బైక్ షోరూంను శుక్రవారం దేవరకొండ శాసనసభ సభ్యులు నేనావత్ బాలు నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చార్జింగ్ బైకులకు ప్రత్యేక స్థానం ఉందని, యువకుల అభిరుచులకు అనుగుణంగా బైక్‌లను మార్కెట్‌లోకి రకరకాల రంగులతో షోరూం యాజమాన్యం తీసుకొచ్చారన్నారు. యువతకు, గృహిణులకు ఫ్యూచర్ ప్లాన్ తో కావాల్సిన ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నాయని బాలాజీ మోటార్స్ యాజమాన్యం తెలిపారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పొల్యూషన్ నివారించే ఎలక్ట్రిక్ బైకులను తయారు చేయడం ఆయా సంస్థల గొప్పతనం అని అన్నారు. విద్యుత్ ఛార్జింగ్ తో తక్కువ ఖర్చుతో బైకులను వినియోగించుకోవచ్చని పది రూపాయల విద్యుత్ ఛార్జింగ్ తో 120 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్, నాన్ రిజిస్ట్రేషన్ షోరూం వాహనాల పట్ల ఎక్కువ మంది ప్రజలు ఈ బైకుల పట్ల ఆకర్షితులవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇంధనం,నిర్వహణ ఖర్చులు తగ్గించి పర్యావరణానికి ఇది ఎంతో దోహదపడుతుందని ఈ వాహనాలు ప్రోత్సహించడంలో ప్రజలు ఎక్కువ మక్కువ చూపాలని ఎమ్మెల్యే తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని రానున్న కాలంలో పెట్రోల్ తో నడిచే బైకులను కొనలేని పరిస్థితి వస్తుందని ముందుగానే పసిగట్టి పర్యావరణం కాలుష్యం కాకుండా ఉండడానికి బ్యాటరీ బైకులను వినియోగంలోకి బాలాజీ షోరూం యాజమాన్యం తీసుకొచ్చారని పర్యావరణానికి ఎంతో ఈ బైకులు ఉపకారిస్తారని వారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ చేతుల మీదుగా షోరూం ప్రారంభించి బ్యాటరీలతో నడిచే బైకులను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ మోటార్స్ యాజమాన్యం ఊరే సురేష్ కుమార్, నీల వెంకటరమణ, కొండూరు రాజేష్, ఆగుదోట నరసింహ్మా బాలాజీ మోటార్స్ సిబ్బందితోపాటు మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొంతం నరసింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, మాస భాస్కర్, ఊరె లక్ష్మణ్, అంగిరేకుల గోవర్ధన్, వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ అంగిరేకుల గోపాల్, క్షత్రజ్ఞ రాజు, ఎరుకల వెంకటయ్య గౌడ్, హరినాయక్, మాజీ జెడ్పిటిసి జంగిటి నరసింహ్మా యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ యాచారం, కొండల్ రెడ్డి, ఈరటి మల్లేష్ యాదవ్, బెదరకోట భాస్కర్, మాజి ఎంపీటీసీ మునుకుంట్ల శేఖర్ గౌడ్, దొంతగోని శేఖర్ గౌడ్, ఎండి. మదార్, రామిని నగేష్, అంగిరేకుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం -పచ్చదనం విజయవంతం



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 9 శాసనసభ న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు ఈనెల 5వ తేదీ నుండి 9వ తేదీవరకు చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమము ఆదిబట్ల పురపాలక సంఘం పరిధిలో విజయవంతం చేయడం జరిగింది. ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చేయబట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వనమహెూత్సవ కార్యక్రమము 4వ వార్డు భాష్యం వెంచర్, మంగళ్ పల్లి లో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కామండ్ల యాదగిరి, 12వ వార్డు కౌన్సిలర్ నారని మౌనిక సుధాకర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలకృష్ణ , మున్సిపల్ ఇంజనీర్ వీరాంజనేయులు, మున్సిపల్ మేనేజర్ రమేష్, ఆర్పీలు,మరియు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# నేడు విద్యుత్ ప్రచారంలో అంతరాయం

**విద్యుత్ శాఖవిజ్ఞప్తి**



**దేవరకొండ ఆగస్టు 9 శాసనసభ న్యూస్:** నేడుఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవరకొండ పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుంది. కరెంటు లైన్ ల పై వాలిన చెట్లను తొలగించుటకు సబ్ స్టేషన్ లో కరెంటు నిలిపివేయబడును. కావున విద్యుత్ వినియోగ దారులందరూ విద్యుత్ సిబ్బందికి సహకరించవలసిందిగా దేవరకొండ విత్ ఏఈ తెలియజేశారు.ఉ

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**చింతపల్లి,ఆగస్టు 9 శాసనసభ న్యూస్** చింతపల్లి మండలంలో హనుమంతులేని అక్రమ ఇసుకరవాణా కొనసాగుతుందని తెలుసుకున్న చింతపల్లి పోలీసులు పక్కా సమాచారంతో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఏ ఎస్ ఐ చంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అనుమతులు లేకుండా దొంగతనంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న %ఋ05ఖీవీ%1317 నెంబరు గల ట్రాక్టర్, ట్రాలి టెంపరరీ రిజిస్ట్రేషన్ నెంబర్ నెంబర్ %ఋ05దీూ=%5473 తో ఉంది. ట్రాక్టర్ జమాని, డ్రైవర్ అయిన కడారి రాజు తండ్రి లక్ష్మయ్య, 24 కుర్మపల్లి గ్రామవాసిని పట్టుకొని చింతపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏ ఎస్ ఐ వై .చంద్రారెడ్డి తెలిపారు.

# నాటిన ప్రతి మొక్క సంరక్షించాలి:

## టి.పి. పి. సి సభ్యులు కాకుమాను సునీల్

**తూర్కయంజాల్, ఆగస్టు 09(శాసన సభ ):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగాశుక్రవారం తూర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డు అన్నపూర్ణ కాలనీలో టి పి సి సి సభ్యులు, కౌన్సిలర్ కాకుమన్ సునీల్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూనాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాలనీ అధ్యక్షులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు



శాసనసభ
శనివారం 10 ఆగస్టు 2024

# రూ.100 కోట్ల నిధులతో మారనున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ రూపురేఖలు





**-మల్‌రెడ్డి రాంరెడ్డి**

**తుర్కయంజాల్, ఆగస్టు 09 ( శాసనసభ ):** వచ్చే విజయదశమి వరకు 100 కోట్ల తుర్కయంజాల్ మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని ఉన్నాయని రోడ్డు రవాణా డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛ ధనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్లతో కలిసి తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పర్యటించారు. మున్సిపాలిటీ లోని పలు కాలనీలలో పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని ప్రజలందరూ కష్టపడి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలిపించిన వెంటనే నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తుర్కయంజాల్ మున్సిపాలిటీ మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులలో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే అండర్ గ్రౌండ్ పనులు, వీధి దీపాల పనులు, నల్లా కనెక్షన్లు పూర్తి అయినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నట్లు అయన తెలిపారు. ఎమ్మెల్యే కృషితో ముఖ్యమంత్రి గ చొరవతో కొత్తగా సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. హయత్ నగర్ నుండి మునుగనూర్, తొర్రూర్ మీదుగా కోహెడ ఔటర్ రింగ్ రోడ్డు వరకు 100 ఫీట్ల రహదారి నిర్మించనున్నట్లు తెలిపారు. తుర్కయంజాల్ నుండి తొర్రూర్ వరకు, ఇంజాపూర్ నుండి అంజానాపూరి కాలనీ మీదుగా మునగనూర్ వరకు, మునగనూర్ నుండి పెద్ద అంబర్ పెట్ వరకు రహదారుల నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుంది అన్నారు. ప్రజలు అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ ను గెలిపించినందుకు కృతజ్ఞతగా మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసినందుకుగాను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మున్సిపల్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 9 శాసనసభ న్యూస్:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో "మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు గారి" ఆధ్వర్యంలో స్వచ్ఛతనం - పచ్చదనం లో భాగంగా 5వ రోజు కార్యక్రమంలో భాగంగా 11వ వార్డులో సాయిరాం నగర్ వెంచర్లు, ఫారెస్ట్ ఆఫీసర్లు సమక్షంలో చెట్లు నాటి వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించిన మున్సిపల్ చైర్మన్,మరియు వివిధ వార్డులలో మట్టితో గుంతలు పూడ్చుడం,వార్డులలో ప్రజలకి అవగాహన కల్పించడం మరియు దోమలు నివారణ చర్యలు చేపట్టడం,కొత్తగా చెట్లు పెట్టడం,ఇతర శానిటేషన్ చేపట్టడం జరిగింది, పాల్గొన్నవారు కమిషనర్ రవీందర్ సాగర్,ఫారెస్ట్ ఆఫీసర్లు,వైస్ చైర్మన్ బర్లమంగా జగదీశ్వర్ యాదవ్ కౌన్సిలర్ మోహన్ నాయక్,మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన.





**తూర్కయంజాల్, ఆగస్టు 09(శాసన సభ ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 4వ రోజు తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్ గ్రామంలోని 1వ వార్డులో స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్త వార్డు పరిధిలోని కాలనీలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతి రావు పూలే,గురుకుల స్కూల్ పిల్లలకి దోమల నివారణ పై విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుంచే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించలని సూచించారు. అనంతరం విద్యార్థుల తో కలిసి మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, స్కూల్ టీచర్స్ జానకి రామ్ నాయకులు గుత్తా వెంకట్ రెడ్డి, కొత్తపల్లి యశ్వంత్, బిల్లు కలెక్టర్లుకె . ప్రవీణ్,ఎస్.ప్రవీణ్,వార్డ్ ఆఫీసర్ శేఖర్,ఆశ వర్క రాణి,జవాన్ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు

# వేములవాడ పట్టణాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తా

**ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



**వేములవాడ :** పట్టణాన్ని మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వీటిడీఏ వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ,నిధులు రూ. 30 లక్షలతో రాజరాజేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా నూతనంగా తీర్చిదిద్దే పనులకు, వేములవాడ లోని మురుగు నీరు రాజన్న ఆలయ గుడి చెరువులో కలవకుండా వేములవాడ మున్సిపల్ నిధులు రూ. 3 కోట్లతో నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ ఛైర్పర్సన్ రామతీర్థపు మాధవి తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం వీటిడీఏ నిధులు రూ. 2 కోట్లతో వేములవాడ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎకరం విస్తీర్ణంలో పార్క్, ఈ సందర్భంగా పార్క్ లో ఏర్పాటు చేసిన ఫౌంటెన్ ను నిర్మించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజన్న ఆలయ సమీపంలో ఉన్న అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు ఒక ఫౌంటెన్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఒక మినీ పార్కు లాగా ఏర్పాటు చేస్తామని వివరించారు. గుడి చెరువులో కలుస్తున్న మురుగునీరు పట్టణ అవతలి వైపు నుండి తీసుకుపోవడానికి రూ.మూడు కోట్లతో నేడు భూమి పూజ చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రాజన్న ఆలయానికి 50 కోట్ల నిధులు.మొదటి ప్రాధాన్యతలో ఆలయ విస్తరణ చేపడతామని, ఇటీవలే రాజన్న ఆలయానికి 50 కోట్ల నిధులను కేటాయించామని చెప్పారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాం. వీలైనంత త్వరలో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. గతంలో నేను శృంగేరి పీఠం ని దర్శించుకున్న సమయాన రాజన్న ఆలయ అభివృద్ధిపై వారితో చర్చించానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పార్క్ లో ఏర్పాటు చేసిన ఆట బొమ్మలు, పరికరాలు ప్రభుత్వ విప్, కలెక్టర్ అందరితో కలిసి పరిశీలించారు. పార్క్ ఆవరణలో ఆధునిక టెక్నాలజీతో టాయిలెట్స్ పురుషులు, మహిళల కోసం రెండు వేరువేరుగా నిర్మించాలని, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, స్నాక్స్ కోసం స్టాల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ సూచించారు. పట్టణంలోని చిన్నారులకు మార్నింగ్, ఈవినింగ్ వాకర్స్ కు ఎంత ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్ రావు, కమిషనర్ అన్వేష్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, తహసిల్దార్ అర్బన్ మహేష్ కుమార్, ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రా, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుణమోని మల్లేష్ మృతి బాధాకరం

**తీదేడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి**



**చింతపల్లి, ఆగస్టు 9 శాసనసభ న్యూస్:** చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన గుణమోని మల్లేష్ ముదిరాజ్ అకాల మృతి బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి అన్నారు. శుక్రవారం మల్లేష్ ఐదవ రోజు సందర్భంగా చిత్ర పటానికి పూల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల పురుషోత్తం రెడ్డి,జూలురు శ్రీధర్,సిమర్ల శ్రీను యాదవ్,మర్రు శ్రీనివాస రావు,వీరమల్ల వెంకటయ్య,గంటెల ఆంజనేయులు,దాసరి మల్లయ్య,పంగ సత్తయ్య,కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

# వన మహోత్సవ మొక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**


**147 హెక్టార్లలో సింగరేణి ఆర్జి 3 ద్వారా మొక్కలు పెంపకం**

**రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని సింగరేణి ఆర్జి 3 లో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**కమాన్‌పూర్ :** వన మహోత్సవం క్రింద నాటే మొక్కల సంరక్షణ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని సింగరేణి ఆర్జి 3 పరిధిలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఆర్జి 3 బొగ్గు బ్లాక్ పరిధిలో నర్సరీని కలెక్టర్ సందర్శించి మొక్కల పెంపకం విధానాన్ని తనిఖీ చేశారు. వన మహోత్సవం కార్యక్రమం కింద చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యాలు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు వంటి పలు అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమం కింద ప్రస్తుతం సంవత్సరంలో సింగరేణి ఆర్జీ 3 పరిధిలో 147.6 హెక్టార్లలో మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దీనికి అనుగుణంగా ఓబి వద్ద 23 హెక్టార్లు , బ్లాక్ ప్లాంటేషన్ కింద 121.6 హెక్టార్లు, అవెంజర్ ప్లాంటేషన్ కింద 3 కిలోమీటర్ల మేర మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి ఇప్పటి వరకు 70 వేల 480 మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సింగరేణి పరిధిలో గ్రీనరీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, పచ్చదనం పెంపొందించడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, దీనిపై మరింత ఫోకస్ తో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్జీ 3 పరిధిలో ఇప్పటివరకు 616 హెక్టార్ల స్థలంలో దాదాపు 10 లక్షల పైగా మొక్కలు నాటడం జరిగిందని, వీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సింగరేణి నర్సరీ ద్వారా అవసరమైన మొక్కలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. అనంతరం రత్నాపూర్ గ్రామంలోని ఓపెన్ కాస్టింగ్ వద్ద మొక్కలు నాటేందుకు గుర్తించిన స్థలంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ సింగరేణి అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివయ్య, సింగరేణి ఆర్ జి 3 జనరల్ మేనేజర్ సుధాకర్ రావు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి. మల్ రెడ్డి రాంరెడ్డి





**తూర్కయంజాల్, ఆగస్టు 09(శాసన సభ ):** తూర్కయంజాల్ మున్సిపల్ పరిధి మునగనూర్ లోని 15 వ వార్డు లోని వేద విద్య నగర్ కాలనిలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవంలో శుక్రవారం తెలంగాణ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతోవర్ధిల్లాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, టీపీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కౌన్సిలర్లు ,రవీందర్ రెడ్డి, మేతరి అనురాధ దర్శన్, ఉదయ్ శ్రీ గోపాల్ రెడ్డి,నాయకులు వెంకట్ రెడ్డి,లక్ష్మణ్,వాసు,రాజేష్ గౌడ్,కుమార్ గౌడ్, మధుసూదన్,పాండు రంగయ్య,యశ్వంత్,నరేందర్ రెడ్డి,కిషన్,నవీన్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు క్రాంతి కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్

# తొమ్మిదో 'సారీ' వడ్డీ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలు నెలకొన్న నేపథ్యంలో హెచ్చు వడ్డీ రేట్లను కొనసాగించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు నిర్ణయించింది. దీంతో హెచ్చు వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశించిన రుణ గ్రహీతలకు మళ్లీ నిరాశనే మిగిలింది. వరుసగా తొమ్మిదో సారి కూడా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. గతంలో 2023 ఫిబ్రవరిలో చివరిసారి రెపో రేటును మార్చింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపిసి) భేటీ గురువారంతో ముగిసింది. అనంతరం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. రెపో రేటును 6.5 శాతంగానే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక రేట్లను యధాతథంగా ఉంచేందుకు ఆరుగురు ఎంపిసి సభ్యుల్లో నలుగురు అనుకూలంగా ఓటు వేశారన్నారు. మిగితా ఇద్దరు సభ్యులు 0.25 శాతం తగ్గించాలని కోరారు. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య రిజర్వు బ్యాంక్ వరుసగా వడ్డీ రేట్లను పెంచింది. ఆరు సార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేక మంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ఆశించిన ప్రతీ సారి వారికి భంగపాటే



జరుగుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణ అసమతుల్యంగా ఉంది. కొన్ని కేంద్ర బ్యాంకులు ఇంకా కఠిన విధానాలను కొనసాగిస్తున్నాయి. పెరుగుతున్న అప్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రధాన సవాల్‌గా మారాయి. బ్యాంకులు, కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లు ఆరోగ్యకరంగా ఉన్నాయి. పెట్టుబడి అవకాశాలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఆగస్టు రెండు నాటికి భారత విదేశీ మారక నిల్వలు 675 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి.

## ఎల్‌ఐసి ఫలితాలు ఆకర్షణీయం




**ముంబయి :** దిగ్గజ బీమా సంస్థ ఎల్‌ఐసి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202425) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10 శాతం వృద్ధితో రూ.10,461 కోట్ల నికర లాభాలు సాధించింది.గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.9,544 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,88,749 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.2,10,910 కోట్లకు చేరిందని గురువారం ఆ సంస్థ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గడిచిన జూన్ త్రైమాసికంలో ఎల్‌ఐసి తొలి ప్రీమియం వ్యాపారం రూ.7,470 కోట్లకు పెరిగింది. ఇది గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.6,811 కోట్లుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో రూ.53,638 కోట్లుగా ఉన్న రెన్యూవల్ ప్రీమియం.. గడిచిన క్యూ1లో రూ.56,429 కోట్లకు పెరిగింది. పెట్టుబడులపై కంపెనీ నికర ఆదాయం రూ.96,183 కోట్లకు పెరిగింది. 2024 ఇదే జూన్ త్రైమాసికంలో రూ.90,309 కోట్ల ఆదాయం చోటు చేసుకుంది. గురువారం బిఎస్‌ఇలో ఎల్‌ఐసి షేర్ విలువ 0.16 శాతం పెరిగి రూ.1,125.70 వద్ద ముగిసింది.

## మళ్లీ షాకిచ్చిన బంగారం ధరలు!



గత మూడు రోజులుగా బంగారం ధరలు భారీగా పడిపోయిన విషయం తెలిసిందే. తులం గోల్డ్ రేటు దాదాపు రూ.1300 పైన దిగొచ్చింది. పెళ్లిళ్ల సీజన్ మొదలైపోయింది కాబట్టి పసిడి ధరలు తగ్గాయని సంతోషించేలోపే.. మళ్లీ షాకిచ్చాయి. నేడు 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.750, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.820 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో శుక్రవారం (ఆగష్టు 9) 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,250గా.. 24 క్యారెట్ల ధర రూ.70,090గా నమోదయింది. దేశంలోని ప్రధాన నగరాల్లో నేటి గోల్డ్ రేట్స్ ఎలా ఉన్నాయో చూద్దాం. తెలుగు రాష్ట్రాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,250గా.. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,090గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.64,440 పలకగా.. 24 క్యారెట్ల ధర రూ.70,240గా నమోదైంది. బెంగళూరు, కోల్‌కతా, పూణే, కేరళలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,250 ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.70,090గా ఉంది. మరోవైపు ఇటీవల తగ్గుతూ వచ్చిన వెండి ధర కూడా నేడు భారీగా పెరిగింది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.1500 పెరిగి.. రూ.83,000కు చేరుకుంది. ఈరోజు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయాయవాడ, విశాఖపట్నంలలో కిలో వెండి ధర రూ.88,000గా నమోదైంది. ఢిల్లీలో రూ.83,000గా.. ముంబైలో రూ.83,000గా ఉంది. అత్యల్పంగా బెంగళూరులో రూ.80,750గా నమోదైంది.

## మీ ఆర్థిక అవసరాలకు బంగారమే భరోసా!




వాల్యూ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాప్స్ గోల్డ్ వారి అనుబంధ సంస్థ, 1901లో స్థాపించబడింది. క్యాప్స్ గోల్డ్ గత 70 ఏళ్లుగా బులియన్ వ్యాపారం, రిటైల్ జ్యువెల్లరీ, జ్యువెల్లరీ తయారీ మరియు గోల్డ్ రిఫైనరీ రంగాల్లో సేవలు అందిస్తున్నారు. వాల్యూ గోల్డ్ సంస్థని సెప్టెంబర్ 2023 హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఎవరైతే వారి ఆర్థిక అవసరాలకు బంగారాన్ని అమ్మి డబ్బు కావాలనుకుంటారో వారి దగ్గర బంగారం కొనే వెసులుబాటుని కల్పిస్తున్నారు. గోల్డ్‌లోన్‌లో ఉన్న బంగారాన్ని కూడా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేటుకే కొని గరిష్ట విలువ చేకూరేలా ఆర్థిక భద్రతను కల్పిస్తున్నా రు. ప్రస్తుతం హైదరాబాద్‌లో బంజారాహిల్స్, సికింద్రాబాద్, ఉప్పల్, కూకట్‌పల్లి మరియు చింతల్‌లో వారి సేవలను అందిస్తున్నారు. వాల్యూ గోల్డ్, తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా బంగారం కొనుగోలు చేసే వాహనాన్ని వినియోగాదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతాల వారికి బంగారం కొనుగోలు సేవలను అత్యాధిక పారదర్శకత మరియు విలువలతో అందించడం. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ బంగారం కొనుగోలు చేసే వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొట్టమొదటి సారిగా, బంగారం కొనుగోలు రంగంలో ఆటోమేటిక్ ప్రక్రియను ప్రవేశపెట్టారు. వ్యక్తుల ప్రమేయమే లేకుండా బరువు మరియు స్వచ్ఛతను, ఘనించి బంగారాన్ని కరిగించి వినియోగదారులకు అత్యధిక మొత్తం చేకూరేలా సేవలను అందిస్తున్నారు. బంగారం మరియు వెండి నాణేలను వారి బ్రాంచీలలో కొనుగోలు చేయవచ్చు. ఎన్ఏబీఎల్ సర్టిఫైడ్ అయిన క్యాప్స్ గోల్డ్ రిఫైనరీ ఈ నాణేలు తయారు చేస్తున్నారు.

## ఇప్పటికైనా జియో గుడ్ న్యూస్ చెప్పింది

అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్ ఆఫర్ చేసి టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పుకు కారణమైన రిలయన్స్ జియో తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ ఓటీటీ యాప్స్‌కు విపరీతమైన ఆదరణ ఉన్న ఈ తరుణంలో రిలయన్స్ జియో 200 రూపాయల లోపే ఓటీటీ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 200 రూపాయల లోపే 12 ఓటీటీ యాప్స్‌ను సబ్‌స్క్రిప్షన్ చేసుకునే ప్లాన్ ను తీసుకొచ్చింది. 175 రూపాయల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌తో 12 ఓటీటీ యాప్స సబ్‌స్క్రిప్షన్ తీసుకుని 28 రోజుల పాటు ఆస్వాదించవచ్చు. అంతేకాదు.. ఈ ప్లాన్‌లో భాగంగా 10 జీబీ హై స్పీడ్ డేటా కూడా పొందొచ్చు. ఎలాంటి డైలీ లిమిట్ లేకుండా ఈ 10 జీబీ డేటాను వాడుకోవచ్చు. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకోవాలనుకునే జియో కస్టమర్లు గుర్తుంచు కోవాల్సిన ముఖ్యమైన విషయం ఒకటి ఉంది. అదేంటంటే.. ఇది కేవలం డేటా బెనిఫిట్స్, ఓటీటీ బెనిఫిట్స్‌తో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ప్లాన్‌లో కాలింగ్ సేవలు ఉండవు. వాయిస్ కాల్స్ కావాలనుకునే వారి కోసం ఈ ప్లాన్ ను తీసుకురాలేదు. ఓటీటీలో వినోదాన్ని ఆస్వాదించే వారి కోసం మాత్రమే ఈ 175 రూపాయల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ను తీసుకొచ్చారు. సోనీ లివ్, జీ5, జియో సినిమా ప్రీమియం, లయన్స్‌గేట్ ప్లే, డిస్కవరీ ప్లస్, సన్ ఎన్ఎక్స్‌టి, కాంచ లంక, ప్లానెట్ మరాఠీ,చౌపల్, డాకుబే, ఎపిక్ ఆన్, హెూయ్ చొయ్ ఓటీటీ యాప్స సేవలను 175 రూపాయల ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌లో 28 రోజుల పాటు ఆస్వాదించవచ్చు.

# స్పోర్ట్స్

# సంచలన ప్రకటన చేసిన రోహిత్ శర్మ

టీమిండియా టి20 వరల్డ్ కప్ గెలిచింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఏడు పరుగుల తేడాతో మట్టికరిపించింది. అదే జోరులో యువభారత్ జట్టు జింబాబ్వేలో పర్యటించింది. ఐదు టి 20 మ్యాచ్ల సిరీస్ ను 4-1 తేడాతో దక్కించుకుంది. అనంతరం శ్రీలంక లో పర్యటించింది. సూర్య కుమార్ యాదవ్ సారథ్యంలో 3 %%20 మ్యాచ్ల సిరీస్ ను 3-0 తేడాతో సొంతం చేసుకుంది. అయితే ఇదే జోరును టీమిండియా రోహిత్ నాయకత్వంలో చూపిస్తుందని.. వన్డే సిరీస్ అదరగొడుతుందని అభిమానులు ఆశించారు. పైగా జట్టుకూర్పులో కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ తనదైన మార్క్ చూపించాడు. దీంతో వన్డే సిరీస్ లో కూడా టీమిండియా కు గెలుపు నల్లేరు మీద నడకని అందరూ అనుకున్నారు. కానీ జరిగింది వేరు.. తొలి వన్డే టీమిండియా బ్యాటర్ల నిర్లక్ష్యం వల్ల టై అయింది. రెండవ వన్డే మిడిల్ ఆర్డర్ వైఫల్యం వల్ల ఓడిపోవాల్సి వచ్చింది. మూడో వన్డేలో ఆటగాళ్ల నిర్లక్ష్యం వల్ల సిరీస్ కోల్పోవలసి వచ్చింది.. దీంతో టీమిండియా ఆటగాళ్లపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జట్టుకూర్పు సరిగ్గా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో జట్టు సిరీస్ కోల్పోవడం పట్ల కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు



సంచలనం కలిగిస్తున్నాయి. టీమిండియా వన్డే సిరీస్ కోల్పోయిన తర్వాత రోహిత్ శర్మ విలేకరుల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.. ఈ క్రమంలో ఓటమికి దారి తీసిన పరిస్థితులను వెల్లడించాడు.. స్లో పిచ్, స్పిన్ బౌలింగ్, బ్యాటర్లలో సమన్వయం లేకపోవడం వంటివి ఓటమికి కారణమయ్యాయని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో టి20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత్ ఆత్మ సంతృప్తి చెందిందా? అని విలేకరులు ప్రశ్నించగా.. దానికి రోహిత్ స్పందించాడు..” భారత్ తరపున ఆడుతున్నప్పుడు అలాంటి మాటకు తావులేదు. నేను నాయకత్వం వహిస్తున్నంతవరకు అలాంటి దానికి అవకాశం ఇవ్వను. దేశం కోసం ఆడడాన్ని నేను గొప్పగా భావిస్తా. దేశం కోసం ఏదైనా చేయడానికి సిద్ధపడతాను. అలాంటప్పుడు ఓటమి అనే పదానికి తావులేదు. సంతృప్తి అనే మాటకు అర్థం లేదు. వన్డే, టి20 లలో నెంబర్ వన్ స్థానంలో ఉన్నాం. టెస్టులలో రెండవ స్థానానికి వచ్చాం. మొదటి స్థానానికి వచ్చిన తర్వాత సంతృప్తి చెందితే అక్కడితోనే ఆగిపోవలసి ఉంటుంది. ఆ తర్వాత మన స్థానాన్ని ఇంకొకరు భర్తీ చేస్తారు. అలాంటి అవకాశం ఇస్తే మనం విఫలమైనట్టు లెక్క. అందుకే అలాంటి వాటికి నేను చోటు ఇవ్వను. శ్రీలంక మాకంటే మెరుగ్గా ఆడింది. స్పిన్ బౌలింగ్ ను ఎదుర్కోవడంలో మా బ్యాటర్లు విఫలమయ్యారు. మాలో లోపాలను సమీక్షించుకుంటాం. కచ్చితంగా బౌన్స్ బ్యాక్ అన్నట్టుగా మళ్లీ విజృంభిస్తాం. ఈ సిరీస్ మీకు కోల్పోయినంత మాత్రాన ప్రపంచం అంత మైనట్టు కాదు. దీని తర్వాత ఎలా మేము పుంజు కోవాలి అనే విషయంపై ఖచ్చితంగా ఆత్మ పరిశీలన చేసుకుంటామని” రోహిత్ వ్యాఖ్యానించాడు.

## భారత హాకీ జట్టు సంచలనం



రెజ్లింగ్ పోటీ ఫైనల్స్ లో వినేశ్ ఫొగాట్ బరువు సమస్య వల్ల పోటీ పడలేకపోయింది. చివరికి మెడల్ సాధించకుండానే నిరాశతో వెను తిరిగింది.దీంతో నిన్నటి నుంచి దేశవ్యాప్తంగా ఒకటే చర్చ మొదలైంది. అటు మీడియాలో తామరతంపరగా కథనాలు ప్రసారమవుతున్నాయి. సోషల్ మీడియాలో లక్షలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో నిరాశలో ఉన్న భారత్ కు గుడ్ న్యూస్ చెప్పింది హాకీ జట్టు. గురువారం జరిగిన కాంస్య పతక పోరులో 2-1 తేడాతో స్పెయిన్ పై విజయాన్ని సాధించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (మ్యాచ్ 30, 33వ నిమిషాలలో) రెండు గోల్స్ చేసి.. భారత జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. ఫలితంగా ఒలింపిక్స్ లో భారత్ సాధించిన మెడల్స్ సంఖ్య నాలుగు కు చేరుకొంది. ఈ మ్యాచ్ లో తొలి క్వార్టర్స్ లో రెండు జట్లు ఒక్క గోల్ కూడా చేయలేకపోయాయి. ఈ క్రమంలో రెండవ క్వార్టర్ ప్రారంభంలో (ఆట 18వ నిమిషం) స్పెయిన్ ప్లేయర్ మిరల్లెస్ పెనాల్టీ స్ట్రోక్ ను అత్యంత చాకచక్యంగా గోల్ గా మలిచాడు. దీంతో స్పెయిన్ లీడ్ లోకి వెళ్ళింది. ఆట 29వ నిమిషంలో భారత జట్టుకు పెనాల్టీ కార్నర్ లభించింది. దానిని హర్మన్ ప్రీత్ గోల్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే దానిని స్పెయిన్ గోల్ కీపర్ సమర్థవంతంగా అడ్డుకున్నాడు. ఇదే సమయంలో మరో పెనాల్టీ కార్నర్ భారత జట్టుకు లభించింది. అయితే ఈసారి ఎలాంటి పొరపాటుకు తావు ఇవ్వకుండా గోల్ చేసింది. హర్మన్ ప్రీత్ తిరుగులేని షాట్ కొట్టడంతో బంతి గోల్డ్ పోస్ట్ లోకి దూసుకెళ్లింది. దీంతో 1-1 తో స్కోర్ లు సమం అయ్యాయి. ఈ క్రమంలోనే మూడో క్వార్టర్ లో భారత జట్టుకు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. దీనిని హర్మన్ ప్రీత్ గోల్ గా మలిచాడు. ఫలితంగా భారత్ 2-1 లీడ్ లోకి వెళ్ళింది. ఆ తర్వాత మూడు పెనాల్టీ కార్నర్లు పొందిన భారత్.. వాటిని గోల్స్ చేయలేకపోయింది. మరో నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా స్పెయిన్ కు పెనాల్టీ కార్నర్ దక్కింది. భారత్ దాన్ని అత్యంత చాకచక్యంగా అడ్డుకుంది. ఇక భారత జట్టు 52 సంవత్సరాల అనంతరం ఒలింపిక్స్ లో వరుసగా 2 కాంస్య పతకాలు సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్ లోనూ భారత్ కాంస్యం దక్కించుకుంది. అంతకుముందు 1968, 1972 లో కంచు పతకాలు సాధించింది.

# గంభీర్‌ని ఒక ఆటాడేసుకుంటున్న నెటిజన్లు..

శ్రీలంక క్రికెట్ జట్టు, భారత క్రికెట్ జట్టును 110 పరుగుల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్ కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగింది. శ్రీలంక టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది.వారు మొదట బ్యాటింగ్ చేసి 248 పరుగులు చేశారు. భారత్ మంచి ప్రారంభం చేసినా, చివరకు వారి ఇన్నింగ్స్ పతనమైంది. శ్రీలంక టీమ్ బౌలర్ డనుష్ వెల్లాలాజ భారత జట్టు బ్యాట్స్‌మెన్‌లను చాలా తేలికగా ఔట్ చేశాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి ముఖ్యమైన ఆటగాళ్లను వెంటనే పెవిలియన్‌కు పంపించేశాడు. దీంతో భారత జట్టు కేవలం 26.1 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైపోయింది. శ్రీలంక 1997 తర్వాత మొదటిసారిగా భారత జట్టును ఓడించింది. అంటే 27 ఏళ్ల తర్వాత శ్రీలంక చేతిలో ఇండియా ఘోరంగా ఓడిపోయింది. ఈ ఓటమికి ఏం టీమ్ ఇండియా కారణం కాదు దానికి హెడ్ కోచ్ కదా వ్యవహరించిన గంభీరే కారణం. ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అనవసరంగా ప్రయోగాలు చేసి ఈ ఓటమికి గంభీర్ కారణమయ్యాడు. అందుకే క్రికెట్ ప్రేమికులు భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్‌ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. కొంతమంది “ఇప్పుడు గౌతమ్ గంభీర్ యుగం ప్రారంభమైంది” అని కూడా వ్యాఖ్యానించారు. అంటే భారత జట్టు ఇప్పుడు తరచూ ఓడిపోతుందని వారు అనుకుంటున్నారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో క్రికెట్ ఆడడం చాలా కష్టం అని అందరూ అనుకుంటారు. కానీ భారత జట్టు ఇప్పుడు శ్రీలంకలో ఓడిపోయింది. అదంతా కూడా గౌతమ్ గంభీర్‌ను చలవేనని క్రికెట్ ఫ్యాన్స్ అతడిని విమర్శిస్తున్నారు. వ్యంగ్యంగా గంభీర్ పై సెటైర్లు పేల్చుతున్నారు. మరి హెడ్ క్యాచ్ బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే ఎంత పెద్ద అవమానకరం ఓటమిని చవిచూసిన



గంభీర్ అనవసరమైన ప్రయోగాలకు పోతాడా లేదంటే గెలుపు కోసమే ప్రయత్నిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. రాహుల్ ద్రవిడ్ అనుకోవచ్చుగా ఉన్నప్పుడు వరల్డ్ కప్ సాధించి పెట్టారు. మరి గంభీర్ అలాంటిది ఏదైనా చెప్పు తగిన ఘనత సాధిస్తారని చూడాలి.






# నానికి సమస్య కాబోతున్న విజయ్


ఆగస్ట్ 29 విడుదల కాబోతున్న సరిపోదా శనివారంకు అదే వారంలో పోటీ లేదు కానీ సరిగ్గా వారం తిరక్కుండానే సెప్టెంబర్ 5 రిలీజయ్యే విజయ్ ది గ్రేటెస్ట్ అఫ్ ఆల్ టైం (గోట్) నుంచి సమస్య తప్పేలా లేదు. నిజానికి ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనులు బ్యాలన్స్ ఉండటంతో ముందు చెప్పిన డేట్ కి రాదేమోననే అందరూ అనుకున్నారు. కానీ వాళ్ళ అంచనాలకు భిన్నంగా గోట్ ఎలాంటి ఇబ్బంది లేకుండా వచ్చే నెల మొదటి వారానికే రావాలని పక్కా ప్రణాళికతో ఉందట. ఈ నెల మూడో వారంలో ట్రైలర్ లాంచ్ తో ప్రమోషన్ల వేగం పెంచబోతున్నట్టు చెన్నై టాక్. మరి నానికి చిక్కేమిటనే పాయిటుకొద్దాం. సరిపోదా శనివారం తమిళంతో సహా ప్రధాన భాషల్లో ప్యాన్ ఇండియా రిలీజ్ జరుపుకుంటోంది. మంచి టాక్ వస్తే కనీసం రెండు మూడు వారాల మంచి రన్ ఉంటుంది. అందులోనూ ఎస్జె సూర్య మెయిన్ విలన్ గా చేయడంతో కోలీవుడ్ ట్రేడ్ లోనూ మంచి డిమాండ్ నెలకొంది. అలాంటిది గోట్ వస్తే ఆటోమేటిక్ గా బజ్ అటు వైపుకి షిఫ్ట్ అయిపోతుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ విజయ్ క్రేజ్ తక్కువ లేదు. తుపాకీ నుంచి వారసుడు దాకా హిట్టు ఫ్లాపు పక్కనపెడితే మార్కెట్ పెరగడమే కానీ తగ్గడం జరగలేదు. పై పెచ్చు కమర్షియల్ గా అన్నీ సేఫ్ అవుతున్నాయి. సో గోట్ కి క్రేజ్ ఎక్కువుంటుంది. పాటల పరంగా ట్రోలింగ్ బారిన పడిన గోట్ లో విజయ్ డ్యూయల్ రోల్ చేయగా స్నేహ, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. జీన్స్ ప్రశాంత్, ప్రభుదేవా కీలక పాత్రలు పోషించారు. నాగచైతన్యకు కస్టడీ లాంటి డిజాస్టర్ ఇచ్చిన దర్శకుడు వెంకట్ ప్రభుకి దొరికిన మంచి ఛాన్స్ ఇది. విజువల్ ఎఫెక్ట్స్ కి పెద్ద పీఠ వేసిన గోట్ లో డీ ఏజింగ్ టెక్నాలజీ వాడి విజయ్ వయసుని అమాంతం తగ్గించడం కోసమే ఎనిమిది కోట్లకు పైగా ఖర్చు పెట్టారు. సో సరిపోదా శనివారంకు యునానిమస్ బ్లాక్ బస్టర్ టాక్ వస్తేనే విజయ్ గోట్ ని తట్టుకోవడం సులభమవుతుంది. నాని టీమ్ నమ్మకమైతే ఆ స్థాయిలోనే కనిపిస్తోంది.

# క్యూరియాసిటీ పెంచుతున్న కొత్త లుక్


టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్‌బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. కాగా బర్త్ డే సందర్భంగా మహేశ్‌బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ సస్పెన్స్ లుక్ ఒకటి విడుదల చేసింది. మహేశ్ బాబు అగ్రెసివ్‌గా కనిపిస్తున్న ఈ స్టిల్ గుంటూరు కారంలోనిదంటూ ఫ్యాన్ తెగ చర్చించుకుం టున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ గుంటూరు కారం సినిమా కోసం డిఫరెంట్ స్క్రిప్టును సిద్ధం చేయడమే కాదు.. అందుకనుగుణంగా కొన్ని పోర్షన్లను కూడా చిత్రీకరించాడట. అయితే పలు కారణాల వల్ల ఆ సన్నివేశాలను తొలిగించారని.. అందులోనిదే ఈ స్టిల్ అని చర్చ నడుస్తోంది. గుంటూరు కారం ప్రమోషన్స్‌లోనే ఈ పోస్టర్ విడుదల చేస్తే బాగుండేది అని కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. తాజా స్టిల్ గుంటూరు కారం ఫస్ట్ లుక్‌ను డామినేట్ చేసేలా ఉండటం వల్లే సస్పెన్స్ లుక్‌ను సీక్రెట్‌గా ఉంచారని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి కారణాల సంగతి ఎలా ఉన్నా ఈ కొత్త లుక్ మాత్రం అభిమానులను థ్రిల్ అందిస్తోంది. ప్రస్తుతం మురారి 4 వెర్షన్ రీరిలీజ్‌ను థియేటర్లలో ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు ఫ్యాన్స్. ఇక మరోవైపు ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 అప్‌డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు.




# విదాముయార్చి నుంచి మరో లుక్



కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి విదాముయార్చి మగిజ్ తిరుమేని దర్శకత్వంలో ఏకే 62గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో కోలీవుడ్ నటుడు ఆరవ్ కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. తాజాగా మేకర్స్ ఆరవ్ లుక్‌ను విడుదల చేశారు. స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న ఆరవ్ ఓ ట్రక్కులో నుంచి దిగుతున్నాడు ఆరవ్. ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఈ చిత్రం నుంచి ఇటీవలే యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. అర్జున్ స్టైలిష్ లుక్‌లో రోడ్డుపై నిలబడి ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. అజిత్ కుమార్ మరోవైపు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో నటిస్తోన్న ఏకే 63 కూడా లైన్‌లో పెట్టాడు. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో రానున్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.



# వీరమల్లులోకి ఆ లెజెండ్.. త్వరలోనే?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మూడు సినిమాలను మధ్యలో ఆపగా.. అందులో అన్నింటికంటే ముందు మొదలైన చిత్రం హరిహర వీరమల్లు. దీని తర్వాత అనౌన్స్ అయిన రెండు చిత్రాలు పూర్తయి విడుదల కాగా..ఇంకో రెండు చిత్రాలు సెట్స్ మీదికి వెళ్లాయి. కానీ హరిహర వీరమల్లు మాత్రం ఇంకా ప్రేక్షకుల ముందుకు రాలేదు. ఏడాది కిందటే ఈ సినిమా హోల్డ్‌లో పడిపోయింది. తర్వాత ఎన్నికల హడావుడి మొదలై సినిమా గురించి ఏ ఊసూ వినిపించలేదు. ఐతే పవన్ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయిన నేపథ్యంలో కొన్ని నెలలు గ్యాప్ తీసుకుని సినిమాల షూటింగ్‌లో పాల్గొంటానని ప్రకటించిన నేపథ్యంలో ఆయన కోసం పెండింగ్‌లో ఉన్న మూడు సినిమాల మేకర్స్ ఎదురు చూస్తున్నారు. ముందు అనుకున్నట్లు ఓజీని కాకుండా హరిహర వీరమల్లును పవన్ రీస్టార్ట్ చేస్తారని వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రచారానికి ఊపు తీసుకొస్తూ హరిహర వీరమల్లు టీం ఇప్పుడో అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండరీ నటుడు అనుపమ్ ఖేర్ నటిస్తున్న విషయాన్ని ప్రకటించారు. పవన్ కళ్యాణ్, అనుపమ్ కాంబో గురించి ఎగ్జైట్ అవుతూ వీరి కలయికలో సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ అప్‌డేట్‌తో పాటు ఈ చిత్రానికి మనోజ్ పరమహంసను కొత్త కెమెరామన్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. క్రిష్ దర్శకుడిగా ఉండగా ఛాయాగ్రహణ బాధ్యతలు రాజశేఖర్ చూశారు. ఇప్పుడు క్రిష్ స్థానంలోకి నిర్మాత ఎ.ఎం.రత్నం తనయుడు జ్యోతికృష్ణ వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కెమెరామన్ కూడా మారారు.



# జాతిరత్నాలు దర్శకుడు.. ఎట్టకేలకు

'జాతిరత్నాలు' సినిమాతో సంచలనం రేపిన దర్శకుడు అనుదీప్ కేవీ. దాని కంటే ముందు అతను 'పిట్టగోడ' అనే చిన్న సినిమా తీసిన సంగతి జనాలకు పెద్దగా తెలియదు. కానీ 'జాతిరత్నాలు'తో అనుదీప్ పేరు మార్మోగిపోయింది. ఇలాంటి కామెడీని తెలుగు తెరపై అంతవరకు చూడలేదు. హీరోలను అంత డంబ్‌గా చూపిస్తూ.. సిల్లీగా అనిపిస్తూనే భలేగా నవ్వించాయి అందులోని కామెడీ సీన్స్.'జాతిరత్నాలు' తర్వాత అనుదీప్ మీద అంచనాలు భారీగా పెరిగాయి కానీ.. 'ప్రిన్స్'తో వాటిని అందుకోలేకపోయాడు. తమిళ, తెలుగు భాషల్లో శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర పరాజయం పాలైంది. ఈ సినిమా విడుదలై రెండేళ్లు కావస్తున్నా అనుదీప్ మరో సినిమాను మొదలుపెట్టకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. రవితేజతో అని ఇంకో హీరోతో అని అనుదీప్ కొత్త చిత్రం గురించి రకరకాల ప్రచారాలు జరిగాయి. కానీ ఆ ప్రచారాలేవీ నిజం కాలేదు.ఐతే ఎట్టకేలకు అనుదీప్ కొత్త చిత్రం ఖరారైంది. దాని గురించి అధికారిక ప్రకటన కూడా ఇచ్చేశారు. యువ కథానాయకుడు విశ్వక్సేన్ ప్రధాన పాత్రలో అనుదీప్ తన కొత్త చిత్రం చేయబోతున్నాడు. ప్రస్తుతం టాలీవుడ్లో మోస్ట్ హ్యాపెనింగ్ బేనర్ అయిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలో టి.జి.విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. విశ్వక్‌కు ఇది 14వ సినిమా. ఈ చిత్రానికి పని చేసే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలేవీ వెల్లడించలేదు. త్వరలోనే క్లారిటీ వస్తుంది.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918